

ఆంధ్రజ్యోతి
**** గరిష్ఠం 28.5 కనిష్ఠం 17.4
ANDHRAJYOTHY
నల్లగొండ
5 సోమవారం 24 నవంబరు 2025



పీ.వీ, మద్ది ఆలోచనల ప్రతిరూపమే
సర్వేల్ గురుకులం
● ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు 7



చికెన్ ధరలు | లైవ్ : రూ.148 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260



పల్లెల్లో ఎన్నికల సందడి

- పంచాయతీల రిజర్వేషన్లు ఖరారు
- అర్ధరాత్రి వరకు కొనసాగిన ప్రక్రియ
- జిల్లాలో 869 సర్పంచ్ పదవులకు రిజర్వేషన్లు
- నేడో, రేపో ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం

డివిజన్	ఎస్టీ		ఎస్సీ		బీసీ		ఓపెన్		మొత్తం
	మహిళ	జనరల్	మహిళ	జనరల్	మహిళ	జనరల్	మహిళ	జనరల్	
నల్లగొండ	0	1	23	26	25	29	53	57	214
మిర్యాలగూడ	37	43	19	23	13	19	62	66	282
దేవరకొండ	49	56	18	23	12	16	46	49	269
చండూరు	3	4	9	12	12	13	25	26	104
మొత్తం	89	104	69	84	62	77	186	198	869

నల్లగొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి కీలక అడుగుపడింది. దీంతో పల్లెల్లో ఎన్నికల సందడి మొదలైంది. సెప్టెంబరులో ప్రకటించిన రిజర్వేషన్లను హైకోర్టు నిలిపివేయడంతో తాజాగా బీసీ డెడికేషన్ కమిషన్ సిఫార్సుల మేరకు ప్రభుత్వం శనివారం జీవోనెం.46 విడుదల చేసింది. దాని ప్రకారం ఆదివారం అర్ధరాత్రి వరకు డివిజన్ల వారీగా రిజర్వేషన్లను అధికారులు ఖరారు చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 50శాతం రిజర్వేషన్ల పరిమితికి లోబడి తాజాగా విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ కొనసాగింది. 2019లో కేటాయించిన రిజర్వేషన్ల శాతం ప్రకారం రొటేషన్ పద్ధతిలో ఖరారు చేశారు. ఆదివారం అర్ధరాత్రి వరకు రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ కొనసాగడంతో జిల్లాలో అధికారిక గెజిట్ విడుదలలో తీవ్ర జాప్యం జరిగింది. డివిజన్ స్థాయిల్లో ఎంపికచేసిన జాబితాలను కలెక్టర్ల ఆధ్వర్యంలోని కమిటీ పరిశీలించి, దాన్ని పంచాయతీరాజ్ కమిషనర్‌కు పంపి అక్కడి నుంచి ఆమోదం కోసం వేచి ఉన్న క్రమంలో అధికారిక గెజిట్ విడుదలలో జాప్యం కొనసాగిందని అధికారవర్గాలు చెబుతున్నాయి. రిజర్వేషన్ల గెజిట్ వచ్చిన వెంటనే ఎన్నికల సంఘం సమావేశం అనంతరం సోమ, మంగళవారాల్లో ఏక్షణమైనా ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు.

869 స్థానాలకు పూర్తయిన రిజర్వేషన్లు

జిల్లాలో మొత్తం 869 గ్రామపంచాయతీల సర్పంచ్ స్థానాలకు ఆదివారం రిజర్వేషన్లు కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోగా, బీసీ రిజర్వేషన్లకు 2024లో చేపట్టిన సామాజిక,

మిగతా 8వ పేజీలో...

ఎన్నికలకు సర్వం సిద్ధమైన యంత్రాంగం

ఎన్నికల సంఘం ఎప్పుడు ఆదేశిస్తే అప్పుడు ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా అధికారులు సిద్ధంగా ఉన్నారు. జిల్లాలో 33 మండలాల్లోని 869 పంచాయతీలు, 7,494 వార్డుల్లో 10,73,506 మంది ఓటర్లు నమోదయ్యారు. ఇప్పటికే బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలను అందుబాటులో ఉంచారు. వార్డుల వారీగా జాబితాలు ఫొటో సహా నమోదు చేశారు. ఒక కుటుంబం ఓట్లన్నీ ఒకే వార్డులో ఉండేలా రూపొందించారు. ఇంటిపక్క ఇళ్లు కూడా ఒకే వార్డులో ఉండేలా చూడడంతో పాటు, వార్డుకు కేటాయించిన ఓటర్లకు మించిన చోట ఒకటి, రెండు ఇళ్లు ఎక్కువ, తక్కువ ఉన్నా ఆ వీధి, లేక వాడ అంతా ఒకే వార్డులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. చిన్న పంచాయతీలకైతే ఒకే లొకేషన్‌లో అన్ని పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. 1,000 ఓట్లు దాటిన చోట ప్రభుత్వ స్కూళ్లతో పాటు, గ్రామపంచాయతీభవనాలు, అంగన్‌వాడీ భవనాలు అనుకూలంగా ఉంటే రెండో లొకేషన్‌ను ఏర్పాటు చేశారు. సర్పంచ్ స్థానాలకు పింక్ రంగు బ్యాలెట్ పత్రాలు, వార్డు మెంబర్ స్థానాలకు తెలుపు రంగు బ్యాలెట్ పత్రాలు కూడా సిద్ధం చేశారు. పోలీసులు సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించారు. 652 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను, 304 సున్నితమైన ప్రాంతాలు, మరో 18 అతి సున్నితమైన ప్రాంతాలుగా గుర్తించారు.



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్

మధ్యవర్తిత్వం పాత్ర ముఖ్యమైనది

హైకోర్టు జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్

నల్లగొండ టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): న్యాయవ్యవస్థలో కేసుల భారాన్ని తగ్గించి వేగవంతమైన న్యాయం అందించడంలో మధ్యవర్తిత్వం (మెడియేషన్) ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని హైకోర్టు జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ఎంజీయూలో జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదు రోజులపాటు శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేటి సమాజంలో కుటుంబ విభేదాలు, ఆస్తి వివాదాలు, వాణిజ్య కేసులు, చిన్నచిన్న వ్యక్తిగత సమస్యల కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించవచ్చన్నారు. తద్వారా కోర్టుల్లో కేసుల సంఖ్య కూడా తగ్గుతుందన్నారు. కక్షిదారులకు సమయం ఆదా అవడమేగాక, తక్కువ వ్యయంతో న్యాయం లభిస్తుందన్నారు. న్యాయవాదులు శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకుముందు ఎంజీయూలో జడ్జికి అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మెంబర్ సెక్రటరీ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ డైరెక్టర్ సిహెచ్.పంచాక్షరి, జిల్లా జడ్జి కవిత, యాదాద్రి జిల్లా జడ్జి జయరాజు పురుషోత్తం, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి అనంతరెడ్డి, జీపీ నాంపల్లి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి




ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

నల్లగొండ రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీగార్డ్ కార్మికుల పెండింగ్ వేతనాలు, పీఎఫ్ వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.భూపాల్ డిమాండ్ చేశారు. మూడు రోజులుగా ఆస్పత్రి కార్మికులు విధులు బహిష్కరించి ఆందోళన నిర్వహిస్తుండగా, ఆదివారం నిర్వహించిన ఆందోళనలో వారు మాట్లాడారు. ఆస్పత్రిలో నూతనంగా నియామకమైన 70 మందికి నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. అదే విధంగా పాత వారికి పీఎఫ్, ఈఎస్ఐ కట్‌చేసినా వారి ఖాతాల్లో జమ చేయడం లేదని ఆరోపించారు. తక్షణమే అధికారులు స్పందించి పెండింగ్ వేతనాలు, పీఎఫ్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చిన్నపాక లక్ష్మీనారాయణ, ఎండి.సలీం, డి.సత్తయ్య, యాదగిరి వెంకన్న, సైదులు, పాల్గొన్నారు.

దేవాలయ భూముల ధ్వంసం నిలిపివేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి



వేణుగోపాలస్వామి గుట్టను పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి

వేములపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణం పేరుతో దేవాలయ భూములను, గుట్టలను ధ్వంసం చేయడం నిలిపివేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని శెట్టిపాలెం గ్రామ శివారు వేణుగోపాలస్వామి దేవాలయ భూములను, గుట్టను పార్టీ కార్యకర్తలతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. అవంతీపురం నుంచి శెట్టిపాలెం వరకు నాలుగులేన్ల రోడ్డు నిర్మాణంలో భాగంగా వేణుగోపాలస్వామి గుట్ట వెంట ప్రభుత్వ భూమి ఉన్నా అక్కడగాక గుట్టను తవ్వి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం సమంజసం కాదన్నారు. దేవాలయ గుట్టను ధ్వంసం చేయకుండా ప్రభుత్వ భూముల్లో రోడ్డు నిర్మాణం చేయాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. అనంతరం వేణుగోపాలస్వామి గుట్టపై ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సాధినేని శ్రీనివాస్‌రావు, బంటు సైదులు, చిల్లంచర్ల అబి, పెదమాం భరత్, చలమల్ల సీతారాంరెడ్డి, జవ్వాజి సత్యనారాయణ, పెదమాం వెంకన్న, జానకిరాంరెడ్డి, నిమ్మల జాన్‌రెడ్డి, పెదమాం ప్రసాద్, చక్కని ఉపేందర్, పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయానికి భక్తుల రద్దీ

కనగల్, నవంబరు 23: (ఆంధ్రజ్యోతి) మండలంలోని దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ పూజలు చేయించి చీరసారె ఒడిబియ్యం సమర్పించారు. కాగా, సాయంత్రం అమ్మవారికి విశేష అలంకరణ చేసి హారతి నివేదించారు. కార్యక్రమాలను ముఖ్య అర్చకుడు మల్లాచారి, అర్చకుడు శ్రవణ్‌చార్యులు నిర్వహించారు.

మదర్ డెయిరీ అప్పుల ఊబిలో..

- రూ.35కోట్లకు పైగా వివిధ బ్యాంకుల్లో అప్పు
- నెలకు రూ.45లక్షల మేర వడ్డీలు
- సహకారం ఇచ్చేందుకు నిరాకరించిన ఎన్‌డీడీబీ?
- పాడి రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించని వైనం
- ఏడు బిల్లులు, రూ.20కోట్లు పెండింగ్

పాడి రైతులకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ఏర్పాటైన నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం (నార్మూల్-మదర్‌డెయిరీ) పీకల్లోతు అప్పుల ఊబిలో చిక్కుకుంది. బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పులకు వడ్డీ భారం పెరుగుతోంది. అప్పుల కారణంగా పాడి రైతులకు బిల్లుల చెల్లింపు కష్టతరంగా మారింది.

● ఆంధ్రజ్యోతి, యాదాద్రి



పాల బిల్లుల కోసం నిరసన తెలుపుతున్న పాడి రైతులు (ఫైల్)

పాడి రైతులకు ప్రతీ నెలలో నార్మూల్ రెండుసార్లు పాల బిల్లులు చెల్లించాలి. అయితే బిల్లులు సకాలంలో మంజూరు కాకపోవడంతో పశుపోషణకు పాడిరైతులు ఇబ్బంది పడుతున్నారు. నార్మూల్ పరిధిలో మొత్తం 290 (ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలు) పాల సంఘాలు ఉన్నాయి. ఈ పాల సంఘాల ద్వారా నిత్యం దాదాపు 50వేల నుంచి 60వేల లీటర్ల పాలను సేకరిస్తున్నారు. పాడి రైతులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు రూ.20కోట్ల మేర ఉన్నాయి. ఇప్పటివరకు ఏడు బిల్లులకు చెందిన ఈ మొత్తాన్ని రైతులకు ఇవ్వాల్సి ఉంది. ఒక్కో గ్రామానికి రూ.20లక్షలకు పైగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఒక్కో రైతుకు కనీసం రూ.5వేల నుంచి రూ.20వేల వరకు బిల్లులు బకాయి ఉన్నట్లు సమాచారం. పశువులకు నిత్యం దాణా, పిట్టు లేనిది పాల ఉత్పత్తి సరిగా రాదు. ఈ నేపథ్యంలో రైతులు పాడి గేదెలు, ఆవుల కోసం దాణాతోపాటు ఇతర విత్తనాలు, పశుగ్రాసంకోసం రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో దాణాతోపాటు వ్యాపారుల నుంచి ఉద్దెర కూడా లభించడంలేదని రైతులు వాపోతున్నారు.

నిరాకరించిన ఎన్‌డీడీబీ?

పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయిన నార్మూల్‌ను గట్టెక్కించేందుకు పాలకవర్గం జాతీయ పాడి అభివృద్ధి బోర్డు(ఎన్‌డీడీబీ)ను ఆశ్రయించింది. ఎన్‌డీడీబీ చైర్మన్‌తో ప్రత్యేకంగా సమావేశమైంది. నార్మూల్‌ను గట్టెక్కించేందుకు ఎన్‌డీడీబీ తొలుత సంసిద్ధం వ్యక్తం చేసింది. ప్రతినిధుల బృందాన్ని పంపింది. ఈ మేరకు ఎన్‌డీడీబీ ప్రతినిధులు నార్మూల్ పరిపాలనా అంశాలు, ఆర్థిక పరిస్థితి, రైతులకు చెల్లిస్తున్న బిల్లులు, తదితర అంశాలను అధ్యయనం చేసింది. నార్మూల్ సంస్థ అప్పుల్లో ఉండగా, లాభాల్లో ఉన్నట్టుగా ఆడిట్ రిపోర్టులు రూపొందించి, పలు బ్యాంకుల ద్వారా రుణాలు పొందినట్లు ఎన్‌డీడీబీ గుర్తించినట్లు సమాచారం. సంస్థకు అప్పు ఉన్నట్టుగా ఒక ఆడిట్, లాభాల్లో ఉన్నట్టుగా మరో ఆడిట్‌ను రూపొందించడంతో నార్మూల్‌ను తమ సంస్థలో కలిపేందుకు ఎన్‌డీడీబీ సందేహం వ్యక్తం చేసినట్లు సమాచారం. మరోవైపు ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్ కింద నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే సహకార రంగం చట్టం ప్రకారం నార్మూల్ సంస్థకు గ్రాంట్ మంజూరు చేసే అవకాశం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇటు ఎన్‌డీడీబీ, అటు ప్రభుత్వ గ్రాంట్ మంజూరుకాకపోవడంతో రైతులకు బిల్లులు చెల్లింపు మరింత జాప్యం జరుగుతోంది.

మొత్తం రూ.35కోట్ల అప్పులు

మదర్ డెయిరీకి ప్రస్తుతం రూ.35కోట్లకు పైగా వివిధ బ్యాంకుల్లో అప్పులున్నాయి. నెలకు రూ.45లక్షల మేరకు వడ్డీలు చెల్లించాల్సి

మిగతా 6వ పేజీలో...

సీఎం వర్గం కానందుకే పదవి రాలేదు

● కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న గుమ్ముల మోహన్‌రెడ్డి, పక్కన శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్గం కానందువల్లే తనకు డీసీసీ అధ్యక్ష పదవి రాలేదని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ శాఖ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం నల్లగొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో నల్లగొండకు వచ్చినప్పుడు ఘన స్వాగతం పలికామని, అప్పుడు ఆయన తన భుజంపై చేయివేసి నడిచాడని, దీంతో తనకు న్యాయం జరుగుతుందని భావించినప్పటికీ ఇప్పుడు నవ్వుతూనే గొంతు కోశాడన్నారు. సీఎంకు సన్నిహితులైన రఘువీర్‌రెడ్డికి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి, పటేల్ రమేష్‌రెడ్డిలకు, ఇతర నేతలకు పదవులు వచ్చాయని, తన విషయంలో కులమే అడ్డుగా మారిందన్నారు. తన తండ్రి ఎంపీనో, ఎమ్మెల్యేనో అయిఉంటే తనకు కూడా పదవి వచ్చి ఉండేదన్నారు. వార్డు మెంబర్ కాలేని వారు సైతం ఉన్నత పదవులు దక్కించుకుంటున్నారని అన్నారు. ఎన్నోఏళ్లుగా పార్టీకోసం పనిచేస్తున్న తనకు కార్పొరేషన్ పదవి, లేదా డీసీసీ అధ్యక్ష పదవి దక్కుతుందని అనుకున్నానని, కానీ న్యాయం జరగలేదన్నారు. గాంధీభవన్ చుట్టూ, సీఎం రేవంత్‌రెడ్డి చుట్టూ ఉన్న వారికే పదవులు వస్తున్నాయని, తనకు కాళ్లు మొక్కే అలవాటు లేదన్నారు.

డీసీసీ అధ్యక్ష పదవి కోసం నిర్వహించిన అభిప్రాయ సేకరణలో మెజార్టీ కార్యకర్తలు తనను కోరుకున్నారని, ఆ విధంగా చేయనప్పుడు అభిప్రాయ సేకరణ ఎందుకు చేశారని ప్రశ్నించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తలుచుకుంటే 24గంటల్లో తనకు ఆర్టీసీ చైర్మన్ పదవి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



చండూరులో గోదాముల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, పక్కన డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

చండూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. చండూరులో రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.38.56 లక్షలతో కొత్తగా నిర్మించనున్న గోదాంకు డీసీసీబి చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా నిర్మిస్తున్న 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గోదాములు రైతులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. చండూరులో రూ.30కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ మల్లేశం, చండూరు సీఐ ఆదిరెడ్డి, ఎస్ఐ వెంకన్న, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ దోటి సుజాత వెంకటేశ్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అనంతచంద్రశేఖర్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ పోలు వెంకట్‌రెడ్డి, ఇంజనీర్ అరవింద్, మాజీ సర్పంచ్ నల్లగంటి మల్లేశం, కలిమికొండ జనార్ధన్, మంచుకొండ జనార్ధన్, కల్లెట్ల మారయ్య, భూతరాజు వేణు, గంజి వెంకటేశం, కారింగు రామ్మూర్తి, పన్నాల లింగయ్య, గండూరి జనార్ధన్, భూతరాజు దశరథ పాల్గొన్నారు.

ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరా శక్తి చీరలు

కనగల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరా మహిళా శక్తి చీరలు అని డీఆర్‌డీవో ఎర్రబెల్లి శేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పర్వతగిరి, కనగల్, జీఎడవల్లి గ్రామాల్లో ఇందిరా శక్తి చీరలను మహిళా సంఘం సభ్యులకు పంపిణీ చేసి, మాట్లాడారు. బతుకమ్మ చీరలకు బదులుగా ఇందిరా మహిళా శక్తి చీరలను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పంపిణీ చేస్తోందన్నారు. మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ నాయకుడు గడ్డం అనూప్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల సాధికారతకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. అదేవిధంగా పగిడిమర్రి, బోయినపల్లి, బుడుమర్లపల్లి, దర్వేశిపురం, తేలకంటిగూడెం, పొనుగోడు గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద చీరల పంపిణీ పండుగ వాతావరణంలో జరిగింది.

ఆయా కార్యక్రమాల్లో మందడి రాంచంద్రారెడ్డి, ఆర్‌టీఏ మెంబర్ రాజురెడ్డి, ఏపీఎం మహేశ్వర్‌రావ్, మాజీ సర్పంచ్‌లు నర్సింగ్ సునితాక్రిష్ణయ్యగౌడ్, గోలి నర్సిరెడ్డి, గోలి జగాల్‌రెడ్డి, బోగరి రాం బాబు, శివయ్య కార్యదర్శులు వీరబాబు, రాజేందర్‌రెడ్డి, ఖాసీం, పద్మ, క్రాంతి, మురళీగౌడ్, శంకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీల మోసాలపై బీసీ సమాజం మేల్కొనాలి



జీవో ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బీసీలను నమ్మించి మోసగించిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను చరిత్ర గుర్తుపెట్టుకుంటుందని బీసీ యూత్, విద్యార్థి జేఏసీ చైర్మన్లు కట్టెకోలు దీపేందర్, అయితగోని జనార్ధన్‌గౌడ్‌లు అన్నారు. కాంగ్రెస్, బీజేపీల మోసాలపై బీసీ సమాజం మేల్కొనాలని వారు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో జీవో 46 ప్రతులను దహనం చేశారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు పరిమితి 50 శాతం మించకూడదని రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 46 విడుదల చేయడాన్ని బీసీ సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. కార్యక్రమంలో పట్టణ చైర్మన్ పుట్ట వెంకన్నగౌడ్, ప్రధాన కార్యదర్శి గజ్జి అజయ్ కుమార్‌యాదవ్, కన్వీనర్ కర్నాటి యాదగిరి, వైస్‌చైర్మన్లు మార్గం సతీష్, వడ్డెబోయిన రామకృష్ణ, జాయింట్ సెక్రటరీలు అనంత నాగరాజు గౌడ్, గడగోజు విజయ్, చెన్నోజు రాజు, ప్రధానకార్యదర్శి అంబటి శివ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సండే సందడి



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. రాష్ట్ర నలుమూలల నుంచి సొంత వాహనాల్లో తరలివచ్చిన భక్తులతో కొండపైన పార్కింగ్ ప్రదేశాలు నిండిపోయాయి. ఉదయం, సాయంత్రం బ్రేక్ దర్శనాలు, మధ్యాహ్నం (ఆరగింపు) కలిపి మూడు గంటల పాటు భక్తులు క్యూలైన్లల్లో వేచి ఉన్నారు. సుమారు 46 వేల మంది భక్తులు స్వామిఅమ్మవార్ల దర్శనానికి రాగా ప్రత్యేక దర్శనం అర్ధగంట, ధర్మదర్శనం గంట సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. క్యూకాంప్లెక్స్ క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సందడి నెలకొంది.

● ఆంధ్రజ్యోతి, యాదగిరిగుట్ట



యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని 65వ నంబరు జాతీయ రహదారి ఆదివారం వాహనాల రద్దీ నెలకొంది. పెద్ద సంఖ్యలో శుభ కార్యాలు, పెళ్లిళ్ల ఉండడంతో హైవేతో పాటు ఇతర లింక్ రోడ్లలో సైతం వాహనాలు బారులు తీరాయి. ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రయాణికులతో కిటకిట లాడింది. బస్సులు దొరకక ప్రయాణికులు అష్టకష్టాలు పడ్డారు. ఉదయం నుంచి రాత్రి వరకు వాహనాల రద్దీ కొనసాగింది. పట్టణంలో ఆదివారం వారాంతపు సంతతో వినియోగదారులతో దుకాణాలు కిక్కిరిసిపోయాయి. అదేవిధంగా నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ నెలకొంది.

● ఆంధ్రజ్యోతి, చౌటుప్పల్ టౌన్, కేతేపల్లి.

మదర్ డెయిరీ.. అప్పుల ఊబిలో

(5వ పేజీ తరువాయి)

వస్తోంది. సంస్థలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి వేతనాలు చెల్లింపులు కూడా అధికంగానే ఉన్నాయి. దీంతో రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించలేకపోతున్నామని సంస్థ ఒప్పుకుంటోంది. సంస్థలో ఉన్న స్థిరాస్తులు విక్రయిస్తే కానీ బయటపడే పరిస్థితి లేదని ఇటీవల జరిగిన మదర్‌డెయిరీ సర్వసభ్య సమావేశంలో ప్రస్తుత పాలకవర్గం ప్రకటించింది. లాభాల్లో నడిచిన డెయిరీని గత పాలకులు తీసుకున్న నిర్ణయాలతో అన్నీ నష్టాలేనని, చిట్యాల, నకిరేకల్, చండూరు, తదితర ప్రాంతాల్లోని మదర్ డెయిరీకి చెందిన భూములపై గత పాలకులు పెద్ద ఎత్తున అప్పులు తేవడంతో తీవ్రంగా నష్టాలు జరిగాయని పేర్కొంది. డెయిరీ నష్టాల్లో కూరుకుపోవడానికి పాలకవర్గమే బాధ్యత వహించాలని, డిస్ట్రిబ్యూటర్‌కు లాభం చేకూర్చే నిర్ణయాలు తీసుకోరాదని, నష్టానికి కారణాలు తెలుసుకుని స్థిర ఆస్తులను విక్రయించకుండా తగిన చర్యలు చేపట్టాలని పాలకవర్గంలోని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. అయితే పాడి రైతులు మాత్రం సంస్థ అప్పులు ఎలా ఉన్నా రైతులకు చేయూతనిచ్చేందుకు ఏర్పడిన మదర్ డెయిరీలో పాలు పోస్తున్న వారికి నెలవారీగా బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు.

స్థిరాస్తుల విక్రయంపైనే దృష్టి

మదర్ డెయిరీకి ఉన్న అప్పులను తీర్చేందుకు ప్రభుత్వం నుంచి ప్రస్తుతం పాలకవర్గం ప్రత్యేక గ్రాంట్ మంజూరుకోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోంది. అయితే కోఆపరేటివ్ చట్టం ప్రకారం మదర్ డెయిరీ ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించడం సాధ్యమవుతుందా? అనే అంశం పరిశీలించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సంస్థను నష్టాల నుంచి గట్టెక్కించేందుకు స్థిరాస్తులు విక్రయించేందుకు పాలకవర్గం మొగ్గు చూపుతోంది. ఈమేరకు పాలకవర్గం సర్వసభ్య సమావేశంలో తీర్మానం కూడా చేసింది. డెయిరీ ఆస్తులను బ్యాంకులు జప్తు చేసిన పక్షంలో తక్కువ ధరకు ఆస్తులు విక్రయాలు జరుగుతాయని, మదర్ డెయిరీ పాలకవర్గం ఆధ్వర్యంలో బహిరంగ మార్కెట్‌లో వేలం వేసిన పక్షంలో అధిక ధర వచ్చే అవకాశం ఉందని యోచిస్తోంది. అందుకు 10 మందితో కమిటీని నియమించింది. చిట్యాల, మిర్యాలగూడ, తదితర ఆస్తులు విక్రయించడం ద్వారా సంస్థకు రూ.55కోట్ల మేరకు వచ్చే అవకాశం ఉందని అంచనా. తద్వారా వివిధ బ్యాంకుల్లో మదర్ డెయిరీకి చెందిన అప్పులు తీర్చడంతోపాటు రైతులకు సకాలంలో పాల బిల్లులు చెల్లించవచ్చని పాలకవర్గం భావిస్తోంది.

నేతల మాటలు నీటిమూటలేనా?

నార్మూల్‌ను అప్పుల ఊబి నుంచి తప్పించి, లాభాల బాట పట్టిస్తామని పలు మార్లు స్థానిక ప్రజాప్రతినిధులు, పాలకవర్గంలోని అధికారపక్షం నేతలు వెల్లడించారు. నార్మూల్ పాలకవర్గం ఎన్నికల సమయంలోనూ రైతులకు అనేక వాగ్దానాలు ఇచ్చింది. ప్రభుత్వం నుంచి తక్షణం సహాయం కోసం జిల్లాలోని ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యలను విన్నవించి నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తామని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ప్రస్తుత చైర్మన్ గడిపాటి మధుసూదన్‌రెడ్డి, పలువురు డైరెక్టర్లు హామీ ఇచ్చారు. అయితే ఇప్పటివరకు రైతులకు ఇచ్చిన ఒక్క హామీ నెరవేరకపోగా... రైతులకు చెల్లించాల్సిన బిల్లులకోసం నెలల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం నుంచి మదర్‌డెయిరీకి ప్రత్యేకంగా గ్రాంట్‌ను మంజూరు చేయించేందుకు పాలకవర్గం కసరత్తు చేస్తోందని యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యతో పాటు ప్రస్తుత నార్మూల్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి ప్రకటించి, రైతులను మోసం చేశారని, ఇప్పటివరకు ప్రభుత్వంతో చర్చించి ఒక్క రూపాయి కూడా మంజూరు చేయించలేదని ప్రతిపక్ష పార్టీకి చెందిన డైరెక్టర్లు విమర్శలు గుప్పిస్తున్నారు.

భగ్గుమన్న పాడి రైతులు

పాల బిల్లులు చెల్లించకపోవడంతో పాడి రైతులు భగ్గుమంటున్నారు. నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో పాడి రైతులు నార్మూల్ పాలకవర్గంపై కన్నెర్ర చేస్తున్నారు. ఎన్ని పాలకవర్గాలు మారినా, రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించడంలేదని పెద్దఎత్తున నిరసనలకు దిగుతున్నారు. రైతులకు చెల్లించాల్సిన పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. సకాలంలో బిల్లులు చెల్లించాలని డిమాండ్‌చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలోని పాల శీతలకరణ కేంద్రం ఎదుట ఇటీవల పాడి రైతులు బైఠాయించారు. రోడ్డుపై పాలను కాచి నిరసన తెలిపారు. పెండింగ్ బిల్లులు చెల్లించే వరకూ ఉద్యమిస్తామని, ప్రతినెలా బిల్లులు చెల్లించేలా తగిన చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



బండారి ప్రభుదాసు(ఫైల్)

నాగారం, నవంబరు 23,(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నాగారం మండల పరిధిలోని నాగారం బంగ్లా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. నాగారం సీఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... వర్ధమానుకోట గ్రామానికి చెందిన పాస్టర్ బండారి ప్రభుదాసు(65) అర్వపల్లి వెళ్లడానికి నాగారం బంగ్లా స్టేజీ ఆటో వద్ద ఎక్కాడు. ఆటో నాగారం బంగ్లా స్టేజీ దాటి అర కిలోమీటరు దూరం రాగానే ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో సూర్యాపేట వైపు వెళ్తున్న జేసీబీని ఆటో డ్రైవర్ దాటే క్రమంలో జేసీబీ వెనుక ఉన్న బొక్కెన ఆటోకు తగిలింది. దీంతో ఆటో ఉన్న బండారి ప్రభుదాసు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రభుదాసుకు భార్య, నలుగురు కూమార్తెలు ఉన్నారు. నాగారం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రభుదాస్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



బద్యా మృతదేహం

తిరుమలగిరి: కారు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునిసిపల్ పరిధిలోని నెల్లిబండతండాకు చెందిన ఆంగొ తు బద్య(50) తన పొలంలో వ్యవసాయం చేస్తూ, కూరగాయలు పండిస్తుంటాడు. తన చేనులో పండిన వివిధ రకాల కూరగాయలను రోజూ తిరుమలగిరిలో విక్రయించడానికి వస్తుంటాడు. రోజూ మాదిరిగా కూరగాయలు విక్రయించి బైక్‌పై తిరిగి ఇంటికి వెళ్తుండగా, రోడ్డు దాటుతున్న క్రమంలో వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో, అక్కడికక్కడే మృతి చెందాడు. బద్యకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు ఆంగోతు వినోద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానంతో అంతమొందించాడు

● ప్రియురాలిని గొంతు నులిమి చంపిన వైనం ● గరిడేపల్లి మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు

హుజూర్‌నగర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా గరిడేపల్లిలో అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన మహిళా కేసును పోలీసులు ఛేదించారు. హుజూర్‌నగర్ పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ చరమందరాజు కేసు వివరాలు వెల్లడించారు. గరిడేపల్లి మండలం గానుగబండకు చెందిన షేక్. సైదాహుస్సేన్, సైదాబీ భార్యభర్తలు, కాగా వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అదే గ్రామానికి చెందిన పాలేల్లి హుస్సేన్‌తో సైదాబీ వివాహేతర సంబంధం పెట్టుకుంది. సైదాబీ గ్రామస్థులతో కలిసి బచ్చన్నపేట గ్రామానికి వరినాట్లు వేసేందుకు వెళ్లేది. ఆమెతో పాటు పాలేల్లి హుస్సేన్ కూడా వెళ్లేవాడు. దీంతో సైదాబీతో పరిచయం పెంచుకున్నాడు. కాగా ఇద్దరి మధ్య పరిచయం పెరిగి వివాహేతర సంబంధానికి దారి తీసింది. పాలేల్లి హుస్సేన్, సైదాబీ గానుగబండ గ్రామంలోని పోకల వెంకటేశ్వర్లుకు చెందిన పాకలో కలిసేవారు. ఇటీవల సైదాబీ వేరే వ్యక్తులతో మాట్లాడుతోందని ప్రియుడు అనుమానం పెంచుకున్నాడు. పదే పదే ఫోన్లు చేసి రమ్మని వేధించేవాడు. ఎలాగైనా సైదాబీని చంపాలని నిర్ణయించుకున్నాడు. ఎప్పుడూ కలుసుకునే ప్రదేశానికి రావాలని హుస్సేన్ ఈ నెల 19న మద్యం సేవించి బైక్‌పై పాక వద్దకు వెళ్ళాడు. కాగా సైదాబి, హుస్సేన్ మాట్లాడుకుంటుండగా ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో సైదాబీని హుస్సేన్ గొంతు నులిమి చంపేశాడు. ఈ విషయం తన గ్రామానికి చెందిన సైదమ్మకు చెప్పి పారిపోయాడు. ఆ విషయం ఎవరికీ తెలియనందున తన భార్య మృతికి అదే గ్రామానికి చెందిన పాలేల్లి హుస్సేన్‌పై అనుమానం ఉందని సైదాబీ భర్త సైదాహుస్సేన్ ఈనెల 20న గరిడేపల్లి పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ కేసు నమోదు చేసి విచారించారు. దీంతో పాల్లేలి హుస్సేన్‌ను పట్టుకొని విచారించి కోర్టుకు రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు. నిందుతుడి సెల్‌ఫోన్, సైదాబీ సెల్‌ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ చలికంటి నరేష్ పాల్గొన్నారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ చరమందరాజు

ఆశయాలు సాధించాలి

ఆలేరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించిన సీపీఐ(ఎంఎల్) న్యూ డెమెక్రసీ నేత ధర్మ విఠల్‌రెడ్డి ఆశయాలు సాధించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జన్నె మల్లేష్ కోరారు. ఆదివారం కొలనుపాకకు చెందిన మాజీ సర్పంచ్, మాజీ వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి వర్ధంతిని ఆదివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ప్రజాప్రతినిధిగా ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. నేడు భౌతికంగా లేకపోయినా పేద ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. కార్యక్రమంలో నాయకులు కొత్తపేట చంద్రయ్య, వస్పరి బాలమల్లేష్, అంజయ్య, వరలక్ష్మి, రవి, కోల అనిత, శ్రవణ్, బాలయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



విఠల్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బాలికపై కుక్కల దాడి

ఆత్మకూర్(ఎస్), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండల పరిధిలోని కందగట్ల గ్రామంలో ఆదివారం పిచ్చికుక్కలు స్వైరవిహారం చేశాయి. వీధి ఆడుకుంటున్న ఆరేళ్ల పాపపై దాడి చేసి గాయపరిచాయి. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో నెమ్మికల్ నుంచి కందగట్ల అమ్మమ్మ ఇంటికి వెళ్లిన ఆరేళ్ల పాప తపస్వి ఇంటి ముందు ఉన్న పీర్లకొట్టం వద్ద ఆడుకుంటుండగా రెండు పిచ్చి కుక్కలు వచ్చి దాడి చేసి గాయపరిచాయి. సమీపంలో ఉన్న స్థానికులు వెంటపడడంతో అవి పారిపోయాయి. గాయపడిన మనరాలిని చికిత్స నిమిత్తం తాత విష్ణుమూర్తి స్థానిక వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. గ్రామంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు.

డీఎస్పీగా శ్రీనివాస్‌రావు బాధ్యతల స్వీకరణ



దేవరకొండ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): దేవరకొండ డీఎస్పీగా ఎంవీ. శ్రీనివాస్‌రావు ఆదివారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. దేవరకొండ ఏఎస్పీగా పని చేసిన మౌనిక ఆదిలాబాద్ ఏఎస్పీగా బదిలీ అయ్యారు. మల్కాజ్‌గిరి ట్రాఫిక్ ఏసీపీగా పనిచేస్తున్న ఎంవీ. శ్రీనివాస్‌రావును దేవరకొండ డీఎస్పీగా బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్సులో చిన్నారుల ప్రతిభ

పెద్దవూర, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్సులో చలకుర్తి గ్రామానికి చెందిన పాతనబోయిన సంతోష్‌కుమార్, ప్రియాంక కుమార్తె పాతనబోయిన సుదీక్ష, కుమారుడు పాతనబోయిన విహాస్ పాల్గొన్నారు. తెలంగాణాకు చెందిన పలువురు మార్షల్ ఆర్ట్స్ (కరాటే, తైక్వాండ్, కుంగ్‌ఫూ) క్రీడాకారులు పాల్గొన్నారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు సాధించడం సంతోషంగా ఉందని చిన్నారులు తెలిపారు. కార్యక్రమంలో కోచ్ మహేష్‌నాయక్ మాస్టర్, శివ మాస్టర్, మహేష్ మాస్టర్ పాల్గొన్నారు.

విద్యార్థి నాయకులపై అక్రమ కేసులు సరికాదు

అడ్డగూడూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న విద్యార్థి సంఘట నాయకులపై కేసు నమోదు చేయడం సరికాదని ఏఐఎస్ఎఫ్ యాదాద్రిభువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతి కుమారి అన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఉప్పల ఉదయ్ కుమార్ అక్రమ అరెస్టును ఖండిస్తూ మండల కేంద్రంలో ఆదివారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. విద్యార్థి సంఘం నాయకులపై అక్రమ కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

24 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

నాగారం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. నాగారం సీఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో మండలంలోని పేరబోయినగూడెం బిక్కెరువాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా 24 ట్రాక్టర్ల ఇసుకను నింపుకుని నాగారం నుంచి తుంగతుర్తి వైపు వెళుతుండగా పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. సోమవారం నాగారం తహసీల్దార్ ఎదుట ఇసుక ట్రాక్టర్ యాజమానులను బైండోవర్ చేయనున్నట్లు తెలిపారు.

లాడ్జీలపై పోలీసుల దాడులు

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 23,(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మునిసిపాలిటీ పరిధిలోని పాతగుట్ట, పట్టణంలోని పలు లాడ్జీలపై స్థానిక సీఐ. బొడ్డుపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో మెరుపు దాడులు చేశారు. లాడ్జిల్లోని రికార్డులను పరిశీలించారు. లాడ్జి నిర్వాహకులను వివరాలు అడిగి తెలుకున్నారు. నియమాలు ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ బొడ్డుపల్లి భాస్కర్, ఎస్ఐలు సైదులు, రూపశ్రీ పాల్గొన్నారు.

ట్రాక్టర్‌తో తొక్కించి చంపే ప్రయత్నం

● చేబదులు డబ్బులు తిరిగివ్వాలంటూ తమ్ముడి దౌర్జన్యం ● సహకరించిన తల్లి ● ప్రతిదాడికి దిగిన సోదరి కుటుంబం ● సూర్యాపేట జిల్లా మునగాల మండలంలో ఘటన



వరి కోత యంత్రాన్ని ట్రాక్టర్‌తో ఢీకొట్టి డ్రైవర్‌పై దాడి చేస్తున్న ఉపేందర్‌రెడ్డి

మునగాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చేబదులుగా ఇచ్చిన డబ్బుల విషయంలో అక్కాబావతో పాటు మేనకోడళ్లపై ట్రాక్టర్‌తో ఓ వ్యక్తి హత్యాయత్నం చేశాడు. ఇందుకు తల్లి సహకరించింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండలం బరాఖత్‌గూడెంలో జరిగింది. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..

మునగాల మండలం బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన దొంతిరెడ్డి కళావతి, సుధాకర్‌రెడ్డి దంపతులకు కుమార్తె, కుమారుడు. నాలుగేళ్ల కిందట సుధాకర్‌రెడ్డి మృతి చెందాడు. 25ఏళ్ల కిందట మునగాల మండలం నర్సింహులగూడెం గ్రామానికి చెందిన రెబబోతు రాంరెడ్డితో వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు. ప్రస్తుతం జ్యోతి దంపతులు కోదాడలో ఉంటున్నారు. ఆమె పెళ్లి సమయంలో బరాఖత్ గూడెంలో తమకు చెందిన కొంత భూమిని జ్యోతికి రాసివ్వగా, మరికొంత భూమిని జ్యోతి కొనుగోలు చేసింది. ప్రస్తుతం ఆ భూమిని సాగు కోసం జ్యోతి కౌలుకు ఇచ్చింది. ఇదిలా ఉండగా ఆమె తమ్ముడు దొంతరెడ్డి ఉపేందర్‌రెడ్డి ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా తిరువూరులో బీఎస్ఎన్ఎల్‌లో జేఈగా ఉద్యోగం చేస్తున్నారు. జ్యోతి కుమార్తె పెళ్లికి కళావతి చేబదులుగా బంగారం, డబ్బు సాయం చేసింది. అయితే అవి తిరిగి ఇవ్వాలని రెండేళ్లుగా జ్యోతితో తల్లి కళావతి, తమ్ముడు ఉపేందర్‌రెడ్డి గొడవ పడుతున్నారు. ఈ క్రమంలో మూడు నెలల కిందట కోదాడలో పెద్దమనుషుల మధ్య జరిగిన పంచాయితీలో డబ్బులు తిరిగి ఇచ్చేలా అంగీకారం కుదిరింది. ఆ మేరకు జ్యోతి డబ్బులు తిరిగి ఇచ్చేంది.

ఇంకా నగదు ఇవ్వాలని వివాదం

ఒప్పందం మేరకు డబ్బులు ఇచ్చినప్పటికీ ఇంకా రూ. 2లక్షల వరకు రావాలంటూ తల్లి కళావతి, తమ్ముడు ఉపేందర్‌రెడ్డి సోదరి జ్యోతిని వేధిస్తున్నారు. ఈ క్రమంలో డబ్బులు ఇచ్చే వరకూ పొలంలో వరికోతలు కోయనివ్వమంటూ ఆదివారం కౌలు రైతును కళావతి, ఉపేందర్‌రెడ్డి కలిసి హెచ్చరించారు. ఈ విషయాన్ని కౌలు రైతు జ్యోతికి తెలియజేయడంతో ఆమె తన భర్త రాంరెడ్డి, కుమార్తెలతో కలిసి పొలం వద్దకు వచ్చింది. ఆ సమయంలో తల్లి కళావతి, ఉపేందర్‌రెడ్డి అక్కడ లేరు. దీంతో దగ్గరుండి యంత్రంతో వరి కోతలు కోయిస్తోంది. విషయం తెలుసుకున్న కళావతి, ఉపేందర్‌రెడ్డిలు ట్రాక్టర్‌పై పొలం వద్దకు వస్తూనే వరి కోత యంత్రాన్ని ఢీకొట్టారు. అనంతరం అడ్డుకోబోయిన జ్యోతి, రాంరెడ్డి, ఆమె కుమార్తెలపైకి ట్రాక్టర్ తీసుకెళ్తుండగా వారు పరుగులు తీశారు. ట్రాక్టర్ దిగిన ఇద్దరు వరి కోత యంత్రం డ్రైవర్‌పై దాడి చేశారు. అడ్డుకునేందుకు వచ్చిన జ్యోతి, రాంరెడ్డి, వారి కుమార్తెలపై దాడి చేశారు. చుట్టుపక్కల రైతులు వచ్చి వారిని కాపాడారు. ప్రతిదాడిలో కళావతికి కూడా స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు జ్యోతి, రాంరెడ్డి, ఆమె కుమార్తెలను కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జ్యోతి ఫిర్యాదు మేరకు ఆమె తల్లి కళావతి, ఉపేందర్‌రెడ్డిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.



గొడవపడుతున్న ఉపేందర్‌రెడ్డి, తల్లి కళావతి(వీపుభాగం కనిపిస్తున్న మహిళ), ఆమె కింద కుమార్తె జ్యోతి

శుభకార్యాలకు విరామం

● శుక్ర మౌఢ్యమి కారణం ● మూడు మాసాల తర్వాతే ముహూర్తాలు ● మాఘమాసం వచ్చే దాక..

గ్రహాల స్థితిని బట్టి మౌఢ్యమి(మూఢాలు) వస్తుంది. మౌఢ్యమి కాలంలో వివాహాది శుభకార్యాలు నిర్వహించరు. ఈ సారి సుమారు మూడు మాసాలు శుభ మూహూర్తాలకు విరామం రానుంది. ఈ నెల 26 నుంచి 2026 ఫిబ్రవరి 17 వరకు (శ్రీ విశ్వావసు నామ సంవత్సరం మార్గశిర శుద్ధ షష్టి నుంచి మాఘ బహుళ అమావాస్య వరకు) శుక్రమౌఢ్యమి ఉంటుంది. దీంతో సుమారు మూడు మాసాల పాటు శుభకార్యాలకు విరామం ఉండనుంది.

● ఆంధ్రజ్యోతి, మోత్కూరు



వివాహాలకు మంచి ముహూర్తాలు వర్షాకాలంలో వ్యవసాయ పనులు ఎక్కువగా ఉండడం, వర్షాలు కురిస్తే పనులకు, రాకపోకలకు అంతరాయం కలుగుతుందని వివాహాలు ఎక్కువగా జరుగవు. వేసవిలో ఎండలు, ఉక్కపోత భరించలేమని అప్పుడూ ఎక్కువగా వివాహాలు చేయడానికి విముఖత చూపుతుంటారు. మార్గశిర, మాఘ మాసాల్లోనే వివాహాలు ఎక్కువగా జరుగుతాయి. ఈ మాసాల్లోనే ఎక్కువ మంచి ముహూర్తాలు ఉంటాయి. ఈ సారి మార్గశిరంలో ఒకట్రెండు ముహూర్తాలే ఉండగా పుష్య మాసం శూన్య మాసమవుతుంది. శుక్ర మౌఢ్యమి కారణంగా మాఘ మాసంలో ఒక్క ముహూర్తం కూడా లేదు. గృహ ప్రవేశాలకు అనుకూలమైన రథసప్తమి, సరస్వతి జన్మదినమైన వసంత పంచమి, మహా మాఘీగా పిలువబడే మాఘ పౌర్ణమి వంటి మంచి తిథులు కూడా ఈ సారి మూఢంలోనే కలిసిపోతున్నాయి.

మౌఢ్యమి(మూఢం) అంటే..

జ్యోతి శాస్త్రం ప్రకారం ఒక గ్రహం సూర్యుడి కిరణాల్లో కనుమరుగై పోవడాన్ని మూఢం అంటారు. గ్రహ శక్తులు బలహీన పడటంతో శుక్ర గ్రహం సూచించే ఫలితాలు అంతగా అనుకూలించవంటారు. శుభ కార్యాలకు గురు బలం ఎంత ముఖ్యమో శుక్ర బలం కూడా అంతే ముఖ్యమంటారు. శుక్రుడు బలహీన పడితే అనుబంధాలు, వివాహ జీవితం, ఆర్థిక అంశాల్లో ప్రతికూలత చూపుతుందని జ్యోతిష్యులు చెబుతారు. అందుకే శుక్ర మౌఢ్యమి ఉన్న కాలంలో ఎలాంటి శుభ కార్యాలూ జరపరని చెబుతారు.

ఈ శుభ కార్యాలు చేయవద్దంటారు

శుక్ర మౌఢ్యమిలో వివాహాలు జరుపడం, పెళ్లి చూపులు, పుట్టు వెంట్రుకలు తీయడం, నూతన గృహ నిర్మాణాలకు భూమిపూజ చేయడం, నూతన గృహ ప్రవేశాలు, విగ్రహ ప్రతిష్ఠ, కొత్త వాహనాలు కొనడం, బోరు, బావులు తవ్వించడం, నూతన వ్యాపారాలు ప్రారంభించడం చేయకూడదంటారు.

వ్యాపారాలపై ప్రభావం

శుభకార్యాలు లేకుంటే ఫంక్షన్‌హాళ్లు, వస్త్ర, నగల దుకాణాల యజమానులు, క్యాటరింగ్, డెకరేషన్, ఫొటో, వీడియో గ్రాఫర్లు, టెంట్ హౌస్‌లు, పూల దుకాణాలు, లైటింగ్, డీజే, సన్నాయి, ఆర్కెస్ట్రా, అద్దె కార్లు, బస్సులు, తదితర వ్యాపారులు, వంట మాస్టర్లు, వర్కర్లు, చివరకు పురోహితులు నెలల తరబడి రాబడి లేక నష్టపోతారు.

ముహూర్తాలు లేవు



శుక్ర మౌఢ్యమి కారణంగా ఈ నెల 26 నుంచి 2026 ఫిబ్రవరి 17 వరకు సుమారు మూడు మాసాలు శుభ కార్యాలకు మంచి రోజులు లేవు. వివాహాలతో పాటు గృహ ప్రవేశాలు, విగ్రహప్రతిష్ఠలు, వరపూజలు లాంటి శుభ కార్యాలేవి చేసుకోకూడదు. ఈ మూడు మాసాలు పలు రంగాల వారికి కొంత గడ్డు కాలమే అయినా భరించక తప్పదు.

● పారునంది సూరిబాబు శర్మ, పురోహితుడు, మోత్కూరు, యాదాద్రిభువనగిరి జిల్లా.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	583.70 అడుగులు
ఎడమకాల్వకు నీటి విడుదల	4034 క్యూసెక్కులు
కుడికాల్వకు	9019 క్యూసెక్కులు
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
సాగర్‌కు నీటి రాక	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1800 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	15,634 క్యూసెక్కులు
మొత్తం గేట్లు	నిల్
	- నాగార్జునసాగర్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	42.88 టీఎంసీలు
నీటి రాక	1000 క్యూసెక్కులు
నీటి విడుదల	8000 క్యూసెక్కులు
	- చింతలపాలెం

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	644 అడుగులు
నీటి రాక	911.02 క్యూసెక్కులు
నీటి విడుదల	911.02 క్యూసెక్కులు
	- కేతేపల్లి

శాలిగౌరారం ప్రాజెక్ట్

పూర్తిస్థాయి నీటి మట్టం	21 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	20 అడుగులు
నీటి రాక	నిల్
నీటి విడుదల	నిల్
	-శాలిగౌరారం

శంకుస్థాపన.. ఇలా కానిచ్చేశారు



సాధారణంగా శిలాఫలకం నిర్మించి, బండపై ప్రజా ప్రతినిధులు, అధికారుల పేర్లు రాస్తారు. కానీ యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం వడాయిగూడెం, జమ్మాపురం గ్రామాలలో హడవిడిగా హెచ్ఎమ్‌డీఏ నిధులతో సీసీరోడ్డు, అండర్ డ్రైయినేజీ, వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు కర్రలకు శిలాఫలకం మాదిరిగా ఫ్లెక్సీ ఏర్పాటు చేసి శంకుస్థాన కానిచ్చేశారు.

● ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, యాదాద్రి

పొంచిఉన్న ప్రమాదం..



యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి లారీల్లో తరలిస్తున్న ధాన్యం బస్తాల లోడ్ ఎక్కువ ఎత్తు వేయిస్తున్నారు. కొనుగోలు కేంద్రం నుంచి భువనగిరి మెయిన్ రోడ్డుకు వెళ్లే దారిలో ఉన్న పక్కన 11కేవీ విద్యుత్ వైర్లకు లారీల నిండా ఉన్న బస్తాలకు విద్యుత్ వైర్లు తగులుతూ ధాన్యం రవాణా జరుగుతుంది. ప్రమాదమని తెలిసినా ధాన్యం బస్తాల లోడ్‌లను తగ్గించడం లేదు. ధాన్యం రవాణా సమయంలో విద్యుత్ అధికారులు ఈ ప్రదేశంలో జాగ్రత్త చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

● ఆంధ్రజ్యోతి, బొమ్మలరామారం

పాత బావులు.. ప్రమాదాలకు నెలవు



నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని పిట్టలగూడెం, వెంకటాపురం, కోయిగూరోనిబావి రోడ్ల వెంట బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. బావులకు రక్షణగోడలు లేవు. వాహనదారులు అప్రమత్తంగా వ్యవహరించకపోతే పక్కనే ఉన్న బావుల్లో పడే అవకాశముంది. గతంలో ఉపాధిహామీ నిధులతో రోడ్డు పక్కన బావులు గుర్తించి పూడ్చేవారు, లేదా వినియోగంలో బావి ఉన్న చోట సైడ్‌వాల్ నిర్మించేవారు. పిట్టలగూడెం వద్ద రోడ్డు పక్కన మూల మలుపులో బావి ఉండడంతో బస్సులు తిరిగే ఈ దారిలో ప్రమాదం పొంచిఉంది.

● ఆంధ్రజ్యోతి, గుర్రంపోడు

జీవితం.. చేజారితే తిరిగి రాదు



'జీవితం చేజారితే తిరిగిరాదు.. యువత డ్రగ్స్, గంజాయి బారిన పడి జీవితాలు నశనం చేసుకోవద్దు' అని సామాజిక కార్యకర్త, ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ అన్నారు. గంజాయి, డ్రగ్స్ వాడితే జరిగే అనర్థాలను యమధర్మరాజు వేషధరణలో వివరిస్తూ సూర్యాపేట జిల్లా అర్వపల్లి, మద్దిరాల, తుంగతుర్తి మండలం కొత్తగూడెం టోల్‌గేట్ వద్ద ఆదివారం ప్రజలకు అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నో డ్రగ్స్. సేవ్‌లైఫ్ అని అవగాహన కల్పించారు.

● అర్వపల్లి, తుంగతుర్తి, మద్దిరాల ఆంధ్రజ్యోతి.

వలస కూలీల తాత్కాలిక గూడు



గ్రామాల్లో పత్తి ఏరడానికి, వరినాట్లు వేయడానికి, కలుపు తీయడానికి సూర్యాపేట, వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి పొట్ట చేతపట్టుకొని వచ్చిన దినసరి కూలీలు నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని మాండ్ర గ్రామ శివారులో తత్కాలిక గుడిసెలు వేసుకున్నారు. ఇక్కడ పని అయిపోయిన తర్వాత వేరే గ్రామానికి వెళ్తుంటారు.

● ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి.

పీవీ, మద్ది ఆలోచనల ప్రతిరూపమే సర్వేల్ గురుకులం

● ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు ● సర్వేల్ గురుకులంలో పీవీ, మద్ది విగ్రహాల ఆవిష్కరణ

సంస్థాన్ నారాయణపురం నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఆలోచనల ప్రతిరూపం, మద్ది నారాయణరెడ్డి చేయూతే గురుకుల పాఠశాలల ఏర్పాటుకు మూల కారణమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సర్వేల్ గురుకుల పాఠశాల ప్రారంభించి 54 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా గురుకుల పాఠశాల ఏర్పాటుకు స్ఫూర్తి నిలిచిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, భూదాత మద్ది నారాయణరెడ్డి విగ్రహాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదివారం ఆవిష్కరించారు. ముందుగా పాఠశాలకు విచ్చేసిన ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు ఎన్‌సీసీ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో రామకృష్ణారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల సౌలభ్యం కోసం అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న పీవీ నరసింహారావు గురుకుల పా ఠశాలల ఏర్పాటుకు నాంది పలికారని ఆయన అన్నారు తాను కూడా సర్వేల్ గురుకుల పాఠశాలలో చదువుకొని ఈ స్థాయికి వచ్చానన్నారు. తాము చదివిన సమయంలో పాఠశాలలో ఈ స్థాయిలో సౌకర్యాలు ఉండేవి కావని ఇప్పుడు ప్రభుత్వంతో పాటు ప్రజా ప్రతినిధులు, అలూమినీ అసోసియేషన్ వారు అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు చేయూత అందిస్తానని రామకృష్ణారావు హామీ ఇచ్చారు.



గురుకుల పాఠశాలలో పీవీ విగ్రహ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రామకృష్ణారావు, పక్కన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

విద్యతోపాటు క్రమశిక్షణ అవసరం : ఎమ్మెల్యే

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి చదువుతోపాటు క్రమశిక్షణ, శారీరక దృఢత్వం అవసరమని ఆయన అన్నారు, చదువుకున్న రోజుల్లో తరగతి గదులు సరిగా ఉండేవి కావని చెట్ల కిందనే చదువుకునే వాళ్లమని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం చదివే బాధ్యత మీ పైనే ఉందని ఆయన అన్నారు. సర్వేల గురుకులంలో సుమారు రూ. 20 కోట్ల వెచ్చించి భవనం నిర్మించినా ఫర్నిచర్ లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను చూసి రూ.కోటితో ఫర్నిచర్ సమకూర్చినట్లు ఆయన తెలిపారు. దేశంలోనే మొట్టమొదటి గురుకుల పాఠశాల సర్వేల్‌లో ఉండడం మన నియోజకవర్గానికి గర్వకారణం అని ఆయన వివరించారు

విద్యాభివృద్ధికి పీవీ సేవలు చిరస్మరణీయం : ఎమ్మెల్సీ

ఎమ్మెల్సీ సురభి వాణీదేవి మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం, గురుకుల పాఠశాలల ఏర్పాటు కోసం దివంగత పీవీ నరసింహారావు చేసిన సేవలు చిరస్మరణీయమని ఆమె అన్నారు. సర్వేలు గురుకుల పాఠశాల స్ఫూర్తితోనే నవోదయ పాఠశాలలు ఏర్పాటు అయ్యాయని ఆమె తెలిపారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తనయుడు ప్రభాకర్‌రావు మాట్లాడుతూ దేశంలో ఆధునిక గురుకుల పాఠశాలల ఏర్పాటుకు నవోదయ పాఠశాలల ఏర్పాటుకు సర్వే గురుకులమే దిక్సూచిగా నిలుస్తుందన్నారు. అలూమిని అసోసియేషన్ అధ్యక్షుడు బూడిద నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తమ అసోసియేషన్ ద్వారా పాఠశాలలో విదార్థుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. అలూమినీ అసోసియేషన్ ప్రతినిధి గుర్రం మల్సూర్ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలకు దీటుగా గురుకుల పాఠశాలలు నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి, గురుకుల విద్యాలయ సంస్థల కార్యదర్శి రమణకుమార్, మద్ది నారాయణరెడ్డి మనవడు మద్ది మాధవరెడ్డి, డీఈవో సత్యనారాయణ, ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి, సతీష్‌కుమార్, అసోసియేషన్ ప్రతినిధులు రాజశేఖర్‌రెడ్డి, సత్యనారాయణ, మల్లేశం, గంగాధర్, కేసీవీ వెంకటనర్సయ్య, ఆచారి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్వేల్ గురుకుల పాఠశాలతో ప్రత్యేకంగా ఏర్పా టు చేసిన యాప్‌ను ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ప్రారంభించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రామకృష్ణారావు ఎమ్మెల్యే సన్మానించారు

శాస్త్రోక్తంగా లక్ష్మీనృసింహుడికి నిత్య పూజలు

● నిత్యాదాయం రూ. 50.49 లక్షలు

యాదగిరిగుట్ట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నిత్య పూజలు శాస్త్రోకంగా నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామి అమ్మ మేల్కొపిన అర్చకులు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టా రు. పాతగుట్టలోనూ స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు ఘ నం గా చేపట్టారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో జరిపారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు.



ప్రాకార మండపంలో నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సుమారు 46 వేల మంది భక్తుల రాక

స్వామి వారి దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. రాష్ట్ర నలుమూలల నుంచి సొంత వాహనాల్లో తరలివచ్చిన భక్తులతో కొండపైన పార్కింగ్ ప్రదేశాలు నిండిపోయి ంది. ఉదయం, సాయంత్రం బ్రేక్ దర్శనాలు, మధ్యాహ్నం (ఆరగింపు) కలిపి మూడు గంటల పాటు భక్తులు క్యూలైన్లల్లో వేచి ఉన్నారు. సుమారు 46 వేల మంది భక్తులు స్వామిఅమ్మవార్ల దర్శనానికి రాగా ప్రత్యేక దర్శనం అర్ధగంట, ధర్మదర్శనం గంట సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు.



గర్భాలయంలో ఉభయ క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

క్యూకాంప్లెక్స్ క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సందడి నెలకొంది. బ్యాటరీ వాహనాల ద్వారా చంటి పిల్లల తల్లులు, వృద్ధులు, మహిళలు, దివ్యాంగులను లిఫ్ట్ ద్వారా తూర్పు తిరువీధికి తరలించారు. కొండపైకి వెళ్లడానికి భక్తుల కోసం తగినన్నీ బస్సులు ఏర్పాటు చేసినప్పటికీ ఎదురుచూపులు తప్పలేదు. ఆలయ ఉత్తర దిశలో భక్తులు ఫొటోలకు పోటీ పడారు. అధిక సంఖ్యలో సత్యదేవుని వ్రతాలు జరిపించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 50,49,359 ఆదా యం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. కాగా, ప్రతి వారం నిర్వహించే సంగీత సభల్లో భాగంగా శ్రీనృత్య (హైదరాబాద్) అకాడమీ కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు.

వైభవంగా లక్ష్మీనృసింహుడి కల్యాణం

మఠంపల్లి, : మట్టపల్లి లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారం స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ప్రాతఃకాలార్చనలు అనంతరం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఉపాలయాల్లో పరివార దేవతలకు ప్రాబో ది నివేదనలు సమర్పించాక క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి సహస్ర నాగవల్లీ దళార్చన నిర్వహించారు.. మధ్యాహ్నం 11 గంటలకు రాజ్యలక్ష్మీ అమ్మవారికి లక్ష కుంకుమార్చన, మహార్నివేదనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెనూ న్రి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ సరికొండ నవీన్ ఆలయ అర్చకులు, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

నల్లగొండ స్పోర్ట్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాస్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో ఆదివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చి గెలుపొందిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపిక చేశారు. ఈనెల 27వ తేదీ నుంచి సంగారెడ్డి లో నిర్వహించనున్న రాష్ట్ర సీనియర్ బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లాకు ఎంపికైన జట్టు ప్రాతినిధ్యం వహించనుంది. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ హఫీజ్‌ఖాన్, రామ్‌ప్రతాప్, దత్తాత్రేయ, సమయుద్దీన్, రమేష్, నజీర్, హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాంకుల కోసం పిల్లలపై ఒత్తిడి తేవొద్దు

● మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

● అట్టహాసంగా రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు ప్రారంభం



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : ర్యాంకుల కోసం తల్లిదండ్రులు తమ పిల్లలపై తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం పంతంగి ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో 69వ స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) యాదాద్రి భువనగిరి జిల్లా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బాలుర, బాలికల అండర్ -17 ఖో ఖో క్రీడలను ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాల ఖో ఖో క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సం దర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల విషయంలో తల్లిదండ్రుల ధోరణి మారాలన్నారు. ర్యాంకుల కోసమే కాకుండా తమ పిల్లలను క్రీడల్లో రాణించే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ఆటలు ఆడాలని తద్వారా శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారన్నారు. క్రీడల అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు తన వంతు సహకరిస్తారనన్నారు. కార్యక్రమంలో డీఈవో కం దుల సత్యనారాయణ, ఎంఈవో గురవారావు, ఎస్‌జీఎఫ్ఐ సెక్రటరీ దశరథ రెడ్డి, వాసం నవీన్, పులి కిశోర్, సత్యనారాయణ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీల్లో నల్లగొండ వాసి ప్రతిభ

నల్లగొండ స్పోర్ట్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పంజాబ్ రాష్ట్రం జలంధర్ ఆర్మ్‌డ్ పోలీస్ స్టేడియంలో నిర్వహించిన 8వ జాతీయ తైక్వాండో పోటీల్లో నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన అబ్దుల్ ముక్సిత్ కాంస్య పతకాన్ని సాధించాడు. తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 21నుంచి 23వరకు తైక్వాండో జాతీయ స్థాయి పోటీలు జరిగాయి. చివరి రోజున రాష్ట్రం నుంచి వెళ్లిన ముక్సిత్ పోటీల్లో కాంస్య పతకం అందుకున్నాడు. ముక్సిత్‌ను కోచ్ ఎండీ యూనస్ కమాల్, తండ్రి ఇలియాజ్‌పాషా అభినందించారు.



ముక్సిత్‌ను అభినందిస్తున్న కోచ్

తైక్వాండో పోటీల్లో గోల్డ్ మెడల్

భువనగిరి రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : భువనగిరి పట్టణానికి చెందిన కొలుపుల మహారాజ్ జిల్లా స్థాయి తైక్వాండో, కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చి గోల్డ్ మోడల్‌ను సాధించారు. స్థానిక న్యూడైమెన్షన్ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో జిల్లా స్థాయి గోల్డ్ మెడల్‌ను జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. పరమేశ్, ప్రదాన కార్యదర్శి గుర్రం కృష్ణ అందజేశారు. కరస్పాండెంట్ పులిమామిడి సుభాష్ రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ కొలుపుల కమలాకర్, ప్రిన్సిపల్ రూపాణి మహారాజ్‌ను అభినందించారు.



మహారాజ్‌కు గోల్డ్ మోడల్‌ను అందజేస్తున్న కోచ్

జాతీయ స్థాయి సదస్సుకు కొండమల్లేపల్లి వాసి

కొండమల్లేపల్లి, నవంబర్ 23 (ఆంధ్రజ్యోతి) : కొండమల్లేపల్లి పట్టణానికి చెందిన జెండర్ కమిటీ జిల్లా అధ్యక్షురాలు చిలువేరు ధనమ్మ కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సెర్ప్, డీఆర్డీఏ సంయుక్తంగా ఈనెల 25న ఢిల్లీలో నైచేతన పేరుతో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సదస్సులో పాల్గొననుంది. ఈ మేరకు ఆదివారం అధికారులు సమాచారం అందించినట్లు తెలిపారు. రాష్ట్రం నుంచి ఐదుగురు మహిళలు వెళ్తుండగా అందులో నల్లగొండ జిల్లా నుంచి తాను ఎంపికైనట్లు ధనమ్మ తెలిపారు. 20 ఏళ్లుగా జిల్లా జెండర్ కమిటీ అధ్యక్షురాలిగా ఉంటూ మహిళా సాధికారతకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాల బలోపేతం చేయడం, భార్యాభర్తల మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించడం, బాల్య వివాహాలను ఆపడం, శిశు విక్రయాలను అరికట్టడంలో తన వంతుగా కృషి చేస్తోంది.

అటకెక్కిన సాంకేతిక విద్య..!

ఫ్యాకల్టీలు లేరు.. ఇంటర్నెట్ రాదు...
హైస్కూళ్లలో మూలనపడిన కంప్యూటర్లు..!
విద్యార్థులకు అందని కంప్యూటర్ పరిజ్ఞానం



మాంద్ర జడ్పీహెచ్ఎస్ భవనం


మాంద్ర జడ్పీహెచ్ఎస్‌లో మూలనపడిన కంప్యూటర్లు

నార్కట్‌పల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు కంప్యూటర్లపై కనీస పరిజ్ఞానం (బేసిక్ నాలెడ్జ్) కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పంపిణీ చేసిన కంప్యూటర్లు మూలనపడ్డాయి. వర్తమాన ఉన్నత విద్యా విధానం, వ్యవస్థ క్రమంగా పూర్తిగా సాంకేతికత వైపు పరుగులు తీస్తున్న తరుణంలో పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు కంప్యూటర్ భాష, వాటి వాడకంపై కనీస అవగాహన కల్పించాలనే లక్ష్యంతో పంపిణీ చేసిన కంప్యూటర్లు వృథాగా పడి ఉన్నాయి. పాడి గేదెను కొన్న రైతు పలుపుతాడుకు ఆలోచించిన చందంగా ఉంది కంప్యూటర్ల పంపిణీలో ప్రభుత్వ విధానం. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్‌లను పంపిణీ చేశారు కానీ వాటి ద్వారా కంప్యూటర్ విద్యను బోధించే శిక్షకుల (ఫ్యాకల్టీ)ను మాత్రం నేటికీ ఇవ్వలేదు. దీంతో ఆయా పాఠశాలల్లో అవి నిరుపయోగంగా మారాయి. ఫలితంగా లక్షల రూపాయల ప్రజాధనం నిరర్థకంగా మారుతోంది.

ప్రతీ పాఠశాలకు 5 చొప్పున పంపిణీ

ఐసీటీ పథకం కింద 2009లో అప్పటి ప్రభుత్వం పాఠశాలలకు కంప్యూటర్లను పంపిణీ చేసింది. పాఠశాలలకు కంప్యూటర్ విద్యను బోధించే ఫ్యాకల్టీని తాత్కాలిక పద్ధతిలో నియమించింది. 2011 వరకు కొనసాగిన తర్వాత ఐసీటీ కూడా నిరాదరణతో నిర్వీర్యమైంది. అనంతరం 2024 జనవరిలో ప్రభుత్వం సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకుని ఎంపిక చేసిన జడ్పీ హైస్కూళ్లలో ప్రతీ పాఠశాలకు 5 చొప్పున కంప్యూటర్లను పంపిణీ చేసింది. ఈ నేపథ్యంలో నార్కట్‌పల్లి మండలంలో మాంద్ర, తొండ్లాయి, ఏపీలింగోటం, శాపల్లి, నక్కలపల్లి జడ్పీహెచ్ఎస్‌లకు ఓ ఏజెన్సీ ద్వారా చేరాయి. అనంతరం వీటిని కొన్నాళ్ల తర్వాత సాంకేతిక సిబ్బంది వచ్చి ఇన్‌స్టాలేషన్ చేశారు. కానీ కారణమేంటో తెలియదు కంప్యూటర్లు పంపిణీ చేయబడిన కొన్ని పాఠశాలలకు టేబుళ్లు, ఫర్నీచర్ వంటివి ఇవ్వగా మరికొన్నింటికి సరఫరా చేయలేదు. మాంద్ర జడ్పీహెచ్ఎస్‌కు ఫర్నీచర్ నేటికీ ఇవ్వలేదు.

ఇంటర్నెట్ సదుపాయం కరువు

ఇదిలా ఉంటే పాఠశాలలకు కంప్యూటర్లను అందజేయడం వరకు బాగానే ఉన్నా వాటిని నిర్వహించడం ద్వారా విద్యార్థులకు కంప్యూటర్‌లో కనీస విజ్ఞానంలో శిక్షణ ఇచ్చేందుకు కావాల్సిన ఫ్యాకల్టీలను ఇవ్వలేదు. పాఠశాలలో ఇప్పటికే వివిధ సబ్జెక్టులను బోధిస్తున్న ఉపాధ్యాయుల్లో ఎవరికైనా కంప్యూటర్ విద్య పట్ల ఆసక్తి ఉంటే కనీసం వారిలో ఎవరికైనా శిక్షణ ఇచ్చారా అంటే అదీ చేయలేదు. అదేవిధంగా ఇంటర్నెట్ కనెక్షన్ కూడా కల్పించలేదు. కంప్యూటర్లపై బేసిక్ నాలెడ్జ్‌ను నేర్పాలంటే కొన్ని అంశాల్లో శిక్షణ ఇచ్చేందుకు ఇంటర్నెట్ సౌకర్యం ఉండాలి. ఓ వైపు ఫ్యాకల్టీలను పంపక.. ఇంకో వైపు ఇంటర్నెట్ కనెక్షన్ లేక.. మరో వైపు ఉపాధ్యాయులకైనా శిక్షణ ఇప్పించక వెరసి పాఠశాలలకు వచ్చిన కంప్యూటర్లు దిష్టిబొమ్మల్లా మారాయి. దీంతో లక్షల రూపాయల ప్రజాధనం నిరర్థకమవుతోంది.

కంప్యూటర్ ఫ్యాకల్టీని ఇవ్వాలి



ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మా ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. కానీ విద్యార్థులకు మాత్రం కంప్యూటర్లపై అవగాహన కల్పించలేకపోతున్నాం. కంప్యూటర్ విద్యను బోధించే శిక్షకుడు లేకపోవడమే ఇందుకు కారణం. ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి కంప్యూటర్ ఫ్యాకల్టీని పాఠశాలకు కేటాయించి వాటిని రోజూ నిర్వహించేలా చర్యలు తీసుకుని విద్యార్థులకు కంప్యూటర్లపై అవగాహన కల్పించేలా చొరవ చూపాలని కోరుతున్నాం.

- జెల్లా మధు, హెచ్ఎం, జడ్పీహెచ్ఎస్, మాంద్ర

సీపీఐ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

మునుగోడు రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికల్లో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని సీపీఐ జిల్లా నాయకుడు నుర్గి చలపతి పేర్కొన్నారు. మండలంలోని చీకటి మామిడిగ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం జిల్లాలో డిసెంబరు 26వ తేదీన నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ప్రజలు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ మండల కార్యవర్గ సభ్యుడు ఈదులకంటి కైలాస్, నాయకులు పులకరం ఆంజనేయులు, ఏరుకొండ యాదయ్య, మేడి చంద్రయ్య, చింతల రమేష్, వెంకటయ్య, నగేష్, చిన్న సైదులు, కాటమయ్య, పాపయ్య పాల్గొన్నారు.

కట్టంగూరులో నేడు చీరల పంపిణీ

కట్టంగూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కట్టంగూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఇందిరమ్మ చీరల పంపిణీ చేయనున్నట్లు ఏపీఎం రాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీరేశం హాజరై మహిళలకు చీరలు అందజేయనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్థులు

నల్లగొండరూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా మండలంలోని పెద్దసూరారం గ్రామంలో నిమ్మన గోటి అండాలు ఇంటి నిర్మాణం పూర్తయింది. ఆదివారం నూతన గృహప్రవేశం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పెండెం రత్నమాల పాండు, మాజీ ఉపసర్పంచ్ గుండె వెంకన్న, నాయకులు పిల్లి యాదగిరి, తంతనపల్లి రామలింగం, బండారు నరసింహ, జలంధర్‌రెడ్డి, వల్కి జానయ్య తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో ఎన్నికల సందడి

(5వ పేజీ తరువాయి)

ఆర్థిక, విద్య సర్వేను ప్రామాణికంగా తీసుకున్నారు. జిల్లాలో తాజాగా, ఖరారైన రిజర్వేషన్ల ప్రకారం ఎస్టీ మహిళలకు 89, ఎస్టీ జనరల్ 104 కలిపి 193 సర్పంచ్ పదవులు ఎస్టీలకు దక్కాయి. ఎస్సీ మహిళలకు 69, ఎస్టీ జనరల్ కేటగిరీలో 84 కలిపి మొత్తం 153 సర్పంచ్ పదవులు ఎస్సీలకు కేటాయించారు. బీసీ మహిళలకు తాజాగా 62 సర్పంచ్ స్థానాలు, బీసీ జనరల్ స్థానాలకు 77 స్థానాలు కలిపి 139 సర్పంచ్ పదవులు బీసీలకు దక్కాయి. ఓపెన్ కేటగిరీలో మహిళలకు 186 స్థానాలు కేటాయించగా, ఓపెన్ జనరల్ కేటగిరీలో 198 సర్పంచ్ స్థానాలు కేటాయించారు

ప్రతీ పేద కుటుంబానికి అండగా ఉంటా

● కేవైసీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుండే వెంకటేశం

గట్టుప్పల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గట్టుప్పల మండలంలోని నిరుపేద కుటుంబాలకు తనవంతుగా సహాయ సహకారాలు అందజేయడంతో పాటు వారికి అండగా ఉంటానని కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు కుండే వెంకటేశం అన్నారు. గట్టుప్పల మండల కేంద్రానికి చెందిన పగిళ్ల శంకరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఆయన ఆదివారం శంకరయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి తనవంతుగా రూ. 5 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ నియోజకవర్గంలో అత్యధికంగా పేద కుటుంబాలు ఉన్నాయని వారికి ఏ ఆపద వచ్చినా తాను అండగా ఉంటానని అన్నారు. ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఉన్న పేద ప్రజల కోసం ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కేవైసీఎస్ నాయకులు దెందే బిక్షం, బొడిసే వెంకటేశం, కుండే చంద్రయ్య, కుండే శంకరయ్య, బీఆర్ఎస్ నాయకులు ఆరిఫ్, ఖమ్మం మల్లేష్ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

చిట్యాలరూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలంలోని ఉరుమడ్ల-వేంబావి గ్రామాల సరిహద్దులో నిర్మించనున్న హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నానాటికి భక్తిభావం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ కోనేటి యాదగిరి, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు చెరుకు సైదులు, మాజీ ఎంపీటీసీ పోలగోని స్వామి, నాయకులు పల్లపు బుద్ధుడు, లింగయ్య, జనార్ధన్, శ్రీను, దినేష్‌లతో పాటు అధిక సంఖ్యలో అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు

'డిజిటల్‌వింగ్ బలోపేతానికి సిద్ధం కావాలి'

శాలిగౌరారం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీలోని యువతను గ్రామ, బూత్ స్థాయిలో డిజిటల్ వింగ్ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ వేముల భరత్ రాజ్ తెలిపారు. శాలిగౌరారంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసే బాధ్యత కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా సభ్యులకు, నాయకులు, కార్యకర్తలకు ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామ, బూత్ స్థాయిలో టీపీసీసీ డిజిటల్ మీడియా సైనికులు ప్రచారానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో చురుకుగా పని చేసే వారిని నియోజకవర్గంలో తొమ్మిది మండలాల్లో మండల, గ్రామ, బూత్ స్థాయి కోఆర్డినేటర్ పదవుల్లో తీసుకొనే అవకాశం ఉందన్నారు. ప్రతీ గ్రామ, బూత్ స్థాయి నుండి సోషల్ మీడియా టీంలో చేరాలని ఆసక్తిగల వారు తనకు తెలియజేయాలని కోరారు.

రిజర్వేషన్ల తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

నల్లగొండ నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల అంశం కొలిక్కి వచ్చే వరకు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించవద్దని బీసీ జేఏసీ కోకన్వీనర్ గాదగోని మహేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జీవో నెంబరు 46తో బీసీలకు అన్యాయం జరుగుతోందని అన్నారు. జీవో 46 పత్రాలను చింపి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బీసీలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బీసీలను మోసం చేసి, మభ్యపెట్టి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే బీసీల ఆగ్రహానికి గురి కావాల్సి ఉంటుందన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్న విధంగా కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు నాగేశ్వరరావు, బసవయ్య, రాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం


కొత్తపల్లిలో ఇందిరా మహిళా శక్తి చీరలను అందుకున్న మహిళలతో డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి

నల్లగొండరూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. నల్ల గొండ మండలంలోని జి చెన్నారం, కొత్తపల్లి గ్రామాల్లో ఆదివారం నిర్వ హించిన కార్యక్రమాల్లో ఆయన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ చే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు, కలెక్టర్ సుచనల మేరకు సోమవారం జిల్లాలోని మహిళలకు చీరలను అందించనున్నట్లు తెలిపారు. నల్లగొండ మండలానికి 11,569 మందికి చీరలు వ చ్చినట్లు పేర్కొన్నారు. జి చెన్నారం, కొత్తపల్లి గ్రామాల్లో 739 మంది మ హిళలకు చీరలను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వినోద, మాజీ సర్పంచులు వెంకన్న, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి: మండలంలో ఇందిర మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తి రవీందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు పూల వెంకటయ్య, ఎంపీడీవో రామకృష్ణశర్మ, మహిళ శక్తి యాదమ్మ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మహిళ సంఘాలు, రేషన్‌కార్డు ఉన్న ప్రతీ మహిళకు చీరలు అందించనున్నట్లు వారు తెలిపారు. రేవెల్లిలో బట్టు జగన్, కొన్‌రెడ్డి వెంకటయ్య మహిళలకు చీరలు పంపిణీ చేశారు. తుమ్మలపల్లిలో గ్రామ కార్యదర్శి నక్క పార్వతి, మమత, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

తిప్పర్తి: రాష్ట్రంలోని ప్రతీ ఆడబిడ్డకు చీరల పంపిణీ చేయనున్నట్లు నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి అన్నారు. తిప్పర్తి మండల పరిధిలోని ఆదివారం జంగారెడ్డిగూడెంలో ఇందిరా మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని మహిళా సంఘ సభ్యురాలు ఉన్న మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని, అదే విధంగా నల్లగొండ నియోజకవర్గంలో మంత్రి వెంకట్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాల అందజేసిన అనంతరం 18 సంవత్సరాలకు పైబడిన వారందరికీ చీరలు పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వనపర్తి అంజయ్య, మాజీ సర్పంచ్ తండు జానమ్మ సాయిలు, వనపర్తి శ్రీరాములు, పాలడుగు మల్లయ్య, ఇంద్రకంటి సైదులు, వెంకటయ్య, పలువురు మహిళలు పాల్గొన్నారు.


నాంపల్లిలో చీరలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


తిప్పర్తి: జంగారెడ్డిగూడెంలో చీరలు పంపిణీ చేస్తున్న రమేష్, సంపత్‌రెడ్డి

మహిళా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

శాలిగౌరారం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమం కోసం శాలిగౌరారం మండల మాజీ వైస్ ఎంపీపీ భూపతి అంజయ్యగౌడ్ అ న్నారు. ఆదివారం మండలంలోని అడ్లూర్ గ్రామంలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజయ్యగౌడ్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో ఇచ్చిన చీరలు మహిళలు ఎవరు ధరించలేదని, ఇప్పుడు ఇస్తున్న చీరలు ఎంతో నాణ్యతతో బాగున్నాయని, ప్రతీ మహిళా చీరలను ఇష్టపడుతున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నడన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చింత నరేందర్, నాయకులు బోడ అరుణ్‌కుమార్, బోడ విజయకుమార్, నిమ్మల కృష్ణ మహిళా సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.


శాలిగౌరారం: అడ్లూరులో మహిళలకు చీరలు అందజేస్తున్న మాజీ వైస్ ఎంపీపీ భూపతి అంజయ్య గౌడ్

ఎన్‌సీసీతో విద్యార్థులకు క్రమశిక్షణ


వల్లాల మోడల్ స్కూల్‌లో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

శాలిగౌరారం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ విద్యార్థులకు క్రమశిక్షణ, దేశభక్తి అలవడుతుందని ఎన్‌సీసీ ఉపాధ్యాయుడు కుక్కడపు శ్రీనివాస్ అన్నారు. శాలిగౌరారం మండలంలోని వల్లాల మోడల్ స్కూల్‌లో ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎన్‌సీసీ విద్యార్థులతో ర్యాలీని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీతో సేవాభావం, బాధ్యత, స్వీయ నియంత్రణ, ఐకమత్యం, దృఢ సంకల్పం, సమయం విలు వ ఇలా పలు రకాల విషయాలు దోహదపడతాయన్నారు. అనంతరం మోడల్ స్కూల్‌లో మొక్కలు నాటారు, ఈ ర్యాలీలో విద్యార్థులు దేశభక్తి గురించి, ఎన్‌సీసీ గొప్పతనం గురించి వివిధ రకా ల నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ ఉపాధ్యాయు లు కుక్కడపు శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఉపాధ్యాయులు దామెర్ల కృష్ణయ్య, చిత్తలూరి సత్యనారాయణ, మైదా సు సంపత్ కుమార్, ఇంకా ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దామెర్ల కృష్ణయ్య, ప్రిన్సిపాల్ కాటేపల్లి కృష్ణమోహన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్: ఎన్‌సీసీ ఆవిర్భావ వేడుకలను ఏవీఎం పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో విద్యార్థులు దేశభక్తి, ఎన్‌సీసీ గొప్పతనం గురించి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కందాళ స్వప్నాశ్రీకాంత్‌రెడ్డి, ఎన్‌సీసీ ఏఎన్‌వో నిమ్మల శంకర్ గౌడ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం



నకిరేకల్ హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశం

నకిరేకల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలపై టీఎస్‌యూటీఎఫ్ నిరంతరం రాజీలేని పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం అన్నారు. నకిరేకల్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన నకిరేకల్, శాలిగౌరారం, కేతేపల్లి మండలాల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్‌సీ, డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కులగణన సర్వే చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే రెమ్యూనరేషన్ విడుదల చేయాలన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ మండల మహాసభలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నర్రా శేఖర్‌రెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు టి. నర్సింహామూర్తి, ఎస్‌టీఎఫ్ఐ మహిళా కన్వీనర్ జి. శ్రీలత, స్టడీ సర్కిల్ కన్వీనర్ రాగి రాకేష్‌కుమార్, నకిరేకల్, శాలిగౌరారం, కేతేపల్లి మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుర్మిళ్ల శ్రీనివాస్, హరికృష్ణ, రవికుమార్, నాగయ్య, జయసాగర్, నాయకులు తిరుపతయ్య, వేణుగోపాల్, సైదమ్మ పాల్గొన్నారు.

గీతన్నల రణభేరిని విజయవంతం చేయాలి


గీతన్నల రణభేరి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గీత కార్మికులు


కేతేపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 28న నిర్వహించే గీతన్నల రణభేరికి గీత కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.వెంకట్‌గౌడ్ కోరారు. కేతేపల్లి మండలంలోని బండపాలెం, కొండకిందిగూడెం గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. గీత కార్మికులతో కలిసి మహాసభల పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. మహాసభలలో గీత కార్మికుల సమస్యలపై పోరాట కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. కల్లుగీత వృత్తిపై 5 లక్షల కుటుంబాలు ఆధారపడి ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. కల్లుగీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో సంఘం నాయకులు బి.సతీష్, ఎన్.నాగయ్య, పి.సతీస్, సీహెచ్.నాగయ్య, నారాయణ, పెద్ది శ్రీను, నాగయ్య, జానయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు


ఎంపీడీవో కార్యాలయంలో సత్యసాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

శాలిగౌరారం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో భగవాన్ సత్యసాయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాలిగౌరారం ఎంపీడీవో గార్లపాటి జ్యోతి లక్ష్మి, పర్యవేక్షకులు శ్రీనివాస్ చారి, ఈసీ వెంకటా చారి, జూనియర్ అసిస్టెంట్లు అజయ్‌కుమార్, ఎల్.శంతన్ కుమార్ మహాజన్, టైపిస్ట్ ఎ.వెంకటయ్య కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నకిరేకల్: సత్యసాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో మహా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వేముల వీరేశం సతీమణి పుష్ప, నకిరేకల్ మునిసిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజితశ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్ గర్రె శ్రీనివాసులు, సభ్యులు బ్రహ్మదేవర బ్రహ్మయ్య, రామ్మోహన్, చిలుకూరు లక్ష్మీనర్సయ్య, సుధాకర్, తొనుపునూరి గాంధీ, మిట్టపల్లి యాదగిరి, దేవరశెట్టి సత్యనారాయణ, పాలెపల్లి రంగయ్య, నాగేశ్వర్‌రావు, సోమయ్య, శంభులింగం, యాదగిరి, దయాకర్, రజిని, లీలావతి, శాంత, సంధ్య పాల్గొన్నారు.



పీ.వీ, మద్ది ఆలోచనల ప్రతిరూపమే

సర్వేల్ గురుకులం

● ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు

7



చికెన్ ధరలు | లైవ్ : రూ.148 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260



పల్లెల్లో ఎన్నికల సందడి

- పంచాయతీల రిజర్వేషన్లు ఖరారు
- అర్ధరాత్రి వరకు కొనసాగిన ప్రక్రియ
- జిల్లాలో 869 సర్పంచ్ పదవులకు రిజర్వేషన్లు
- నేడో, రేపో ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం

డివిజన్	ఎస్టీ		ఎస్సీ		బీసీ		ఓపెన్		మొత్తం
	మహిళ	జనరల్	మహిళ	జనరల్	మహిళ	జనరల్	మహిళ	జనరల్	
నల్లగొండ	0	1	23	26	25	29	53	57	214
మిర్యాలగూడ	37	43	19	23	13	19	62	66	282
దేవరకొండ	49	56	18	23	12	16	46	49	269
చండూరు	3	4	9	12	12	13	25	26	104
మొత్తం	89	104	69	84	62	77	186	198	869

నల్లగొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి కీలక అడుగుపడింది. దీంతో పల్లెల్లో ఎన్నికల సందడి మొదలైంది. సెప్టెంబరులో ప్రకటించిన రిజర్వేషన్లను హైకోర్టు నిలిపివేయడంతో తాజాగా బీసీ డెడికేషన్ కమిషన్ సిఫార్సుల మేరకు ప్రభుత్వం శనివారం జీవోనెం.46 విడుదల చేసింది. దాని ప్రకారం ఆదివారం అర్ధరాత్రి వరకు డివిజన్ల వారీగా రిజర్వేషన్లను అధికారులు ఖరారు చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 50శాతం రిజర్వేషన్ల పరిమితికి లోబడి తాజాగా విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ కొనసాగింది. 2019లో కేటాయించిన రిజర్వేషన్ల శాతం ప్రకారం రొటేషన్ పద్ధతిలో ఖరారు చేశారు. ఆదివారం అర్ధరాత్రి వరకు రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ కొనసాగడంతో జిల్లాలో అధికారిక గెజిట్ విడుదలలో తీవ్ర జాప్యం జరిగింది. డివిజన్ స్థాయిల్లో ఎంపికచేసిన జాబితాలను కలెక్టర్ల ఆధ్వర్యంలోని కమిటీ పరిశీలించి, దాన్ని పంచాయతీరాజ్ కమిషనర్‌కు పంపి అక్కడి నుంచి ఆమోదం కోసం వేచి ఉన్న క్రమంలో అధికారిక గెజిట్ విడుదలలో జాప్యం కొనసాగిందని అధికారవర్గాలు చెబుతున్నాయి. రిజర్వేషన్ల గెజిట్ వచ్చిన వెంటనే ఎన్నికల సంఘం సమావేశం అనంతరం సోమ, మంగళవారాల్లో ఏక్షణమైనా ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు.

869 స్థానాలకు పూర్తయిన రిజర్వేషన్లు

జిల్లాలో మొత్తం 869 గ్రామపంచాయతీల సర్పంచ్ స్థానాలకు ఆదివారం రిజర్వేషన్లు కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోగా, బీసీ రిజర్వేషన్లకు 2024లో చేపట్టిన సామాజిక,

మిగతా 8వ పేజీలో...

ఎన్నికలకు సర్వం సిద్ధమైన యంత్రాంగం

ఎన్నికల సంఘం ఎప్పుడు ఆదేశిస్తే అప్పుడు ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా అధికారులు సిద్ధంగా ఉన్నారు. జిల్లాలో 33 మండలాల్లోని 869 పంచాయతీలు, 7,494 వార్డుల్లో 10,73,506 మంది ఓటర్లు నమోదయ్యారు. ఇప్పటికే బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలను అందుబాటులో ఉంచారు. వార్డుల వారీగా జాబితాలు ఫొటో సహా నమోదు చేశారు. ఒక కుటుంబం ఓట్లన్నీ ఒకే వార్డులో ఉండేలా రూపొందించారు. ఇంటిపక్క ఇళ్లు కూడా ఒకే వార్డులో ఉండేలా చూడడంతో పాటు, వార్డుకు కేటాయించిన ఓటర్లకు మించిన చోట ఒకటి, రెండు ఇళ్లు ఎక్కువ, తక్కువ ఉన్నా ఆ వీధి, లేక వాడ అంతా ఒకే వార్డులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. చిన్న పంచాయతీలకైతే ఒకే లొకేషన్‌లో అన్ని పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. 1,000 ఓట్లు దాటిన చోట ప్రభుత్వ స్కూళ్లతో పాటు, గ్రామపంచాయతీభవనాలు, అంగన్‌వాడీ భవనాలు అనుకూలంగా ఉంటే రెండో లొకేషన్‌ను ఏర్పాటు చేశారు. సర్పంచ్ స్థానాలకు పింక్ రంగు బ్యాలెట్ పత్రాలు, వార్డు మెంబర్ స్థానాలకు తెలుపు రంగు బ్యాలెట్ పత్రాలు కూడా సిద్ధం చేశారు. పోలీసులు సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించారు. 652 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను, 304 సున్నితమైన ప్రాంతాలు, మరో 18 అతి సున్నితమైన ప్రాంతాలుగా గుర్తించారు.



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్

మధ్యవర్తిత్వం పాత్ర ముఖ్యమైనది

హైకోర్టు జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్

నల్లగొండ టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): న్యాయవ్యవస్థలో కేసుల భారాన్ని తగ్గించి వేగవంతమైన న్యాయం అందించడంలో మధ్యవర్తిత్వం (మెడియేషన్) ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని హైకోర్టు జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ఎంజీయూలో జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదు రోజులపాటు శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేటి సమాజంలో కుటుంబ విభేదాలు, ఆస్తి వివాదాలు, వాణిజ్య కేసులు, చిన్నచిన్న వ్యక్తిగత సమస్యల కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించవచ్చన్నారు. తద్వారా కోర్టుల్లో కేసుల సంఖ్య కూడా తగ్గుతుందన్నారు. కక్షిదారులకు సమయం ఆదా అవడమేగాక, తక్కువ వ్యయంతో న్యాయం లభిస్తుందన్నారు. న్యాయవాదులు శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకుముందు ఎంజీయూలో జడ్జికి అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, ఆర్డీవో వై.అశోకొరెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మెంబర్ సెక్రటరీ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ డైరెక్టర్ సిహెచ్.పంచాక్షరి, జిల్లా జడ్జి కవిత, యాదాద్రి జిల్లా జడ్జి జయరాజు పురుషోత్తం, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి అనంతరెడ్డి, జీపీ నాంపల్లి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

మదర్ డెయిరీ అప్పుల ఊబిలో..

- రూ.35కోట్లకు పైగా వివిధ బ్యాంకుల్లో అప్పు
- నెలకు రూ.45లక్షల మేర వడ్డీలు
- సహకారం ఇచ్చేందుకు నిరాకరించిన ఎన్‌డీడీబీ?
- పాడి రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించని వైనం
- ఏడు బిల్లులు, రూ.20కోట్లు పెండింగ్

పాడి రైతులకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ఏర్పాటైన నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం (నార్ముల్-మదర్‌డెయిరీ) పీకల్లోతు అప్పుల ఊబిలో చిక్కుకుంది. బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పులకు వడ్డీ భారం పెరుగుతోంది. అప్పుల కారణంగా పాడి రైతులకు బిల్లుల చెల్లింపు కష్టతరంగా మారింది.

● ఆంధ్రజ్యోతి, యాదాద్రి



పాల బిల్లుల కోసం నిరసన తెలుపుతున్న పాడి రైతులు (ఫైల్)

పాడి రైతులకు ప్రతీ నెలలో నార్ముల్ రెండుసార్లు పాల బిల్లులు చెల్లించాలి. అయితే బిల్లులు సకాలంలో మంజూరు కాకపోవడంతో పశుపోషణకు పాడిరైతులు ఇబ్బంది పడుతున్నారు. నార్ముల్ పరిధిలో మొత్తం 290 (ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలు) పాల సంఘాలు ఉన్నాయి. ఈ పాల సంఘాల ద్వారా నిత్యం దాదాపు 50వేల నుంచి 60వేల లీటర్ల పాలను సేకరిస్తున్నారు. పాడి రైతులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు రూ.20కోట్ల మేర ఉన్నాయి. ఇప్పటివరకు ఏడు బిల్లులకు చెందిన ఈ మొత్తాన్ని రైతులకు ఇవ్వాల్సి ఉంది. ఒక్కో గ్రామానికి రూ.20లక్షలకు పైగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఒక్కో రైతుకు కనీసం రూ.5వేల నుంచి రూ.20వేల వరకు బిల్లులు బకాయి ఉన్నట్లు సమాచారం. పశువులకు నిత్యం దాణా, ఫీట్టు లేనిది పాల ఉత్పత్తి సరిగా రాదు. ఈ నేపథ్యంలో రైతులు పాడి గేదెలు, ఆవుల కోసం దాణాతోపాటు ఇతర విత్తనాలు, పశుగ్రాసంకోసం రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో దాణాతోపాటు వ్యాపారుల నుంచి ఉద్దెర కూడా లభించడంలేదని రైతులు వాపోతున్నారు.

నిరాకరించిన ఎన్‌డీడీబీ?

పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయిన నార్ముల్‌ను గట్టెక్కించేందుకు పాలకవర్గం జాతీయ పాడి అభివృద్ధి బోర్డు(ఎన్‌డీడీబీ)ను ఆశ్రయించింది. ఎన్‌డీడీబీ చైర్మన్‌తో ప్రత్యేకంగా సమావేశమైంది. నార్ముల్‌ను గట్టెక్కించేందుకు ఎన్‌డీడీబీ తొలుత సంసిద్ధం వ్యక్తం చేసింది. ప్రతినిధుల బృందాన్ని పంపింది. ఈ మేరకు ఎన్‌డీడీబీ ప్రతినిధులు నార్ముల్ పరిపాలనా అంశాలు, ఆర్థిక పరిస్థితి, రైతులకు చెల్లిస్తున్న బిల్లులు, తదితర అంశాలను అధ్యయనం చేసింది. నార్ముల్ సంస్థ అప్పుల్లో ఉండగా, లాభాల్లో ఉన్నట్టుగా ఆడిట్ రిపోర్టులు రూపొందించి, పలు బ్యాంకుల ద్వారా రుణాలు పొందినట్లు ఎన్‌డీడీబీ గుర్తించినట్లు సమాచారం. సంస్థకు అప్పు ఉన్నట్టుగా ఒక ఆడిట్, లాభాల్లో ఉన్నట్టుగా మరో ఆడిట్‌ను రూపొందించడంతో నార్ముల్‌ను తమ సంస్థలో కలిపేందుకు ఎన్‌డీడీబీ సందేహం వ్యక్తం చేసినట్లు సమాచారం. మరోవైపు ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్ కింద నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే సహకార రంగం చట్టం ప్రకారం నార్ముల్ సంస్థకు గ్రాంట్ మంజూరు చేసే అవకాశం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇటు ఎన్‌డీడీబీ, అటు ప్రభుత్వ గ్రాంట్ మంజూరుకాకపోవడంతో రైతులకు బిల్లుల చెల్లింపు మరింత జాప్యం జరుగుతోంది.

మొత్తం రూ.35కోట్ల అప్పులు

మదర్ డెయిరీకి ప్రస్తుతం రూ.35కోట్లకు పైగా వివిధ బ్యాంకుల్లో అప్పులున్నాయి. నెలకు రూ.45లక్షల మేరకు వడ్డీలు చెల్లించాల్సి

మిగతా 6వ పేజీలో...

కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి



ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

నల్లగొండ రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీగార్డ్ కార్మికుల పెండింగ్ వేతనాలు, పీఎఫ్ వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.భూపాల్ డిమాండ్ చేశారు. మూడు రోజులుగా ఆస్పత్రి కార్మికులు విధులు బహిష్కరించి ఆందోళన నిర్వహిస్తుండగా, ఆదివారం నిర్వహించిన ఆందోళనలో వారు మాట్లాడారు. ఆస్పత్రిలో నూతనంగా నియామకమైన 70 మందికి నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. అదే విధంగా పాత వారికి పీఎఫ్, ఈఎస్‌ఐ కట్‌చేసినా వారి ఖాతాల్లో జమ చేయడం లేదని ఆరోపించారు. తక్షణమే అధికారులు స్పందించి పెండింగ్ వేతనాలు, పీఎఫ్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చిన్నపాక లక్ష్మీనారాయణ, ఎండి.నలీం, డి.సత్తయ్య, యాదగిరి వెంకన్న, సైదులు, పాల్గొన్నారు.

దేవాలయ భూముల ధ్వంసం నిలిపివేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి



వేణుగోపాలస్వామి గుట్టను పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి

వేములపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణం పేరుతో దేవాలయ భూములను, గుట్టలను ధ్వంసం చేయడం నిలిపివేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని శెట్టిపాలెం గ్రామ శివారు వేణుగోపాలస్వామి దేవాలయ భూములను, గుట్టను పార్టీ కార్యకర్తలతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. అవంతీపురం నుంచి శెట్టిపాలెం వరకు నాలుగులేన్ల రోడ్డు నిర్మాణంలో భాగంగా వేణుగోపాలస్వామి గుట్ట వెంట ప్రభుత్వ భూమి ఉన్నా అక్కడగాక గుట్టను తవ్వి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం సమంజసం కాదన్నారు. దేవాలయ గుట్టను ధ్వంసం చేయకుండా ప్రభుత్వ భూముల్లో రోడ్డు నిర్మాణం చేయాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. అనంతరం వేణుగోపాలస్వామి గుట్టపై ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సాధినేని శ్రీనివాస్‌రావు, బంటు సైదులు, చిల్లంచర్ల ఆటీ, పెదమాం భరత్, చలమల్ల సీతారాంరెడ్డి, జవ్వాజి సత్యనారాయణ, పెదమాం వెంకన్న, జానకిరాంరెడ్డి, నిమ్మల జాన్‌రెడ్డి, పెదమాం ప్రసాద్, చక్కని ఉపేందర్, పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయానికి భక్తుల రద్దీ

కనగల్, నవంబరు 23: (ఆంధ్రజ్యోతి) మండలంలోని దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ పూజలు చేయించి చీరసారె ఒడిబియ్యం సమర్పించారు. కాగా, సాయంత్రం అమ్మవారికి విశేష అలంకరణ చేసి హారతి నివేదించారు. కార్యక్రమాలను ముఖ్య అర్చకుడు మల్లాచారి, అర్చకుడు శ్రవణ్‌చార్యులు నిర్వహించారు.

సీఎం వర్గం కానందుకే పదవి రాలేదు

● కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న గుమ్ముల మోహన్‌రెడ్డి, పక్కన శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్గం కానందువల్లే తనకు డీసీసీ అధ్యక్ష పదవి రాలేదని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ శాఖ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం నల్లగొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో నల్లగొండకు వచ్చినప్పుడు ఘన స్వాగతం పలికామని, అప్పుడు ఆయన తన భుజంపై చేయివేసి నడిచాడని, దీంతో తనకు న్యాయం జరుగుతుందని భావించినప్పటికీ ఇప్పుడు నవ్వుతూనే గొంతు కోశాడన్నారు. సీఎంకు సన్నిహితులైన రఘువీర్‌రెడ్డికి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి, పటేల్ రమేష్‌రెడ్డిలకు, ఇతర నేతలకు పదవులు వచ్చాయని, తన విషయంలో కులమే అడ్డుగా మారిందన్నారు. తన తండ్రి ఎంపీనో, ఎమ్మెల్యేనో అయిఉంటే తనకు కూడా పదవి వచ్చి ఉండేదన్నారు. వార్డు మెంబర్ కాలేని వారు సైతం ఉన్నత పదవులు దక్కించుకుంటున్నారని అన్నారు. ఎన్నోఏళ్లుగా పార్టీకోసం పనిచేస్తున్న తనకు కార్పొరేషన్ పదవి, లేదా డీసీసీ అధ్యక్ష పదవి దక్కుతుందని అనుకున్నానని, కానీ న్యాయం జరగలేదన్నారు. గాంధీభవన్ చుట్టూ, సీఎం రేవంత్‌రెడ్డి చుట్టూ ఉన్న వారికే పదవులు వస్తున్నాయని, తనకు కాళ్లు మొక్కే అలవాటు లేదన్నారు.

డీసీసీ అధ్యక్ష పదవి కోసం నిర్వహించిన అభిప్రాయ సేకరణలో మెజార్టీ కార్యకర్తలు తనను కోరుకున్నారని, ఆ విధంగా చేయనప్పుడు అభిప్రాయ సేకరణ ఎందుకు చేశారని ప్రశ్నించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తలుచుకుంటే 24గంటల్లో తనకు ఆర్టీసీ చైర్మన్ పదవి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



చండూరులో గోదాముల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, పక్కన డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

చండూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. చండూరులో రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.38.56 లక్షలతో కొత్తగా నిర్మించనున్న గోదాంకు డీసీసీబి చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా నిర్మిస్తున్న 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గోదాములు రైతులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. చండూరులో రూ.30కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ మల్లేశం, చండూరు సీఐ ఆదిరెడ్డి, ఎస్ఐ వెంకన్న, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ దోటి సుజాత వెంకటేశ్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అనంతచంద్రశేఖర్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ పోలు వెంకట్‌రెడ్డి, ఇంజనీర్ అరవింద్, మాజీ సర్పంచ్ నల్లగంటి మల్లేశం, కలిమికొండ జనార్దన్, మంచుకొండ జనార్ధన్, కల్లెట్ల మారయ్య, భూతరాజు వేణు, గంజి వెంకటేశం, కారింగు రామ్మూర్తి, పన్నాల లింగయ్య, గందూరి జనార్ధన్, భూతరాజు దశరథ పాల్గొన్నారు.

ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరా శక్తి చీరలు

కనగల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరా మహిళా శక్తి చీరలు అని డీఆర్‌డీవో ఎర్రబెల్లి శేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పర్వతగిరి, కనగల్, జీఎడవల్లి గ్రామాల్లో ఇందిరా శక్తి చీరలను మహిళా సంఘం సభ్యులకు పంపిణీ చేసి, మాట్లాడారు. బతుకమ్మ చీరలకు బదులుగా ఇందిరా మహిళా శక్తి చీరలను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పంపిణీ చేస్తోందన్నారు. మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ నాయకుడు గడ్డం అనూప్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల సాధికారతకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పెట్టపీట వేస్తోందన్నారు. అదేవిధంగా పగిడిమర్రి, బోయినపల్లి, బుడుమర్లపల్లి, దర్వేశిపురం, తేలకంటిగూడెం, పొనుగోడు గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద చీరల పంపిణీ పండుగ వాతావరణంలో జరిగింది.

ఆయా కార్యక్రమాల్లో మండడి రాంచంద్రారెడ్డి, ఆర్‌టీఏ మెంబర్ రాజురెడ్డి, ఏపీఎం మహేశ్వర్‌రావ్, మాజీ సర్పంచ్‌లు నర్సింగ్ సునితాక్రిష్ణయ్యగౌడ్, గోలి నర్సిరెడ్డి, గోలి జగాల్‌రెడ్డి, బోగరి రాం బాబు, శివయ్య కార్యదర్శులు వీరబాబు, రాజేందర్‌రెడ్డి, ఖాసీం, పద్మ, క్రాంతి, మురళీగౌడ్, శంకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీల మోసాలపై బీసీ సమాజం మేల్కొనాలి



జీవో ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బీసీలను నమ్మించి మోసగించిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను చరిత్ర గుర్తుపెట్టుకుంటుందని బీసీ యూత్, విద్యార్థి జేఏసీ చైర్మన్లు కట్టికోలు దీపేందర్, అయితగోని జనార్దన్‌గౌడ్‌లు అన్నారు. కాంగ్రెస్, బీజేపీల మోసాలపై బీసీ సమాజం మేల్కొనాలని వారు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో జీవో 46 ప్రతులను దహనం చేశారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు పరిమితి 50 శాతం మించకూడదని రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 46 విడుదల చేయడాన్ని బీసీ సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. కార్యక్రమంలో పట్టణ చైర్మన్ పుట్ట వెంకన్నగౌడ్, ప్రధాన కార్యదర్శి గజ్జి అజయ్ కుమార్‌యాదవ్, కన్వీనర్ కర్నాటి యాదగిరి, వైస్‌చైర్మన్లు మార్గం సతీష్, వడ్డేబోయిన రామకృష్ణ, జాయింట్ సెక్రటరీలు అనంత నాగరాజు గౌడ్, గడగోజు విజయ్, చెన్నోజు రాజు, ప్రధానకార్యదర్శి అంబటి శివ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కాజ్‌వేల పైనుంచి ప్రవహిస్తున్న వరద

● ఇబ్బంది పడుతున్న వాహనదారులు

● పట్టించుకోని అధికారులు


లక్ష్మీదేవిగూడెం రోడ్డులో కాజ్‌వేపై పారుతున్న వరద నీరు

గుర్రంపోడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గుర్రంపోడు మండలంలోని పలు గ్రామాల మధ్య కాజ్‌వేలపై నుంచి వరదనీరు ప్రవహిస్తుంది. వరదనీరు ప్రవహిస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చినప్పుడు మాత్రమే వరదనీరు ప్రవహించి ఆ తర్వాత మాములుగా ఉండే కాజ్‌వేలు ఏఎమ్మార్పీ కాల్వల నీటికి వర్షపు నీరు తోడుకావడంతో పాటు వరి పొలాల నీరు ప్రవహిస్తోంది. కాజ్‌వేలు నాచుపట్టి వా హనాల టైర్లు జారి ప్రమాదాలు జరగడం, నడిచి వెళ్లేవారు జారి కింద పడటం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

లోలెవల్ కాజ్‌వేలు ఇవే...

మండలంలోని బోడపాడు - బొల్లారం గ్రామాల మధ్య, నల్లగొండ - దేవరకొండ ప్రధానరహదారి నుంచి లక్ష్మీదేవిగూడెం రోడ్డులో, వెంకటపురం ఎస్ గ్రామానికి వెళ్లే రోడ్డులో, చేపూరు - తెరాటిగూడెం గ్రామాల మధ్య, పిట్టలగూడెం - వట్టికోడు గ్రామాల మధ్యలో, తెరాటిగూడెం - బంటుగూడెం దారిలో కాజ్‌వేలు ఉన్నాయి. మొసంగి - కొతలాపురం మధ్య గునలు వేసి మట్టిపోసిన సరైన ఎత్తులో లేక శేశిలేటి వాగు ఉధృతంగా పారితే రాకపోకలు నిలిచిపోవాల్సిందే. మొసంగి - తమడపల్లి దారిలో కాజ్‌వే వల్ల ప్రయాణం కష్టంగా మారుతోంది. తెరాటిగూడెం - మొసంగి గ్రామాల మధ్య కాజ్‌వేపై నుంచి గూనలు వేసి బ్రిడ్జి నిర్మించే పనులకు నిధులు సరిపోవని తెచ్చిన గూనలు కూడా కాంట్రాక్టర్ తీసుకొని వెళ్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాజ్‌వేలు నాచుపట్టి జారుతూ ద్విచక్ర వాహనదారులకు, బాటసారులకు ప్రమాదాలు పొంచి ఉన్నాయి. కాజ్‌వేలో వాహనాలు జారి పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. మహిళలు కాజ్‌వే నీటిలో రోడ్డు దాటాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాజ్‌వేలను బ్రిడ్జిలుగా మార్చి సమస్యలు పరిష్కరించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

కల్వర్టులుగా మార్చాలి



మొసంగి - తెరాటిగూడెం, కొతలాపురం గ్రామాల మధ్యలో ఉన్న కాజ్‌వేలను కల్వర్టులుగా మార్చాలి. తెరాటిగూడెం - మొసంగి మధ్యలో కల్వర్టు నిర్మాణానికి రెండేళ్ల క్రితమే బిడ్జి మంజూరైంది. కాంట్రాక్టర్ పని ప్రారంభించలేదు. కాజ్‌వేలను కల్వర్టులుగా మార్చకపోవడంతో రైతులు ఇబ్బందులుపడుతున్నారు.

- నామాల సురేందర్, మొసంగి

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

● ఇబ్బందులు పడుతున్న 'ఆదర్శ' విద్యార్థులు

గుర్రంపోడు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల సమీపంలో రహదారి వెంట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదం చోటు చేసుకునే అవకాశం ఉందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల ముందు ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ రోడ్డు వెంట మూగజీవాలు మేత కోసం తిరుగుతుంటాయి. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతున్నాయి. తక్షణమే ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ గోడ నిర్మించాలని, లేకపోతే ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటికి మార్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


రక్షణ గోడ లేకుండా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

టీపీయూఎస్ మండల అధ్యక్షుడిగా రాజశేఖర్

హాలియా, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మిర్యాలగూడ డివిజన్ స్థాయి సమావేశం ఆదివారం మిర్యాలగూడలోని శిశుమందిర్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా అనుముల మండల అధ్యక్షుడిగా రేణిగుంట్ల రాజశేఖర్, కార్యదర్శిగా గుర్రం సత్యనారాయణరెడ్డి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పులిమామిడి దామోదర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ సంఘ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అసోసి యేట్ అధ్యక్షుడు అలుగుబెల్లి పాపిరెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇరుగు శ్రీరామ్, బత్తిని భాస్కర్‌గౌడ్, మిర్యాలగూడ డివిజన్ ఇన్‌చార్జి తలకోల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


రాజశేఖర్

వీటీనగర్‌లో సత్యసాయి జయంతి

చింతపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్(మాల్) సాయిమందిర్‌లో సత్యసాయి జయంతిని భక్తులు వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు సత్యసాయి బాబాకు పూలమాలలతో అష్టోతర శతనామావళి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండూరి భవానీపవన్‌కుమార్, ఆర్య వైశ్య మహిళలు, విశ్రాంత ఉపాధ్యాయుడు వంగూరు శ్యాంసుందర్, పూరె యాదయ్య, జనార్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సత్యసాయి జయంతిలో పాల్గొన్న మాజీ ఎంపీపీ భవాని, ఆర్యవైశ్య మహిళలు

ధైర్యానికి, సాహసానికి ప్రతిరూపం శివాజీ

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


శివాజీ విగ్రహానికి భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ధైర్యానికి, సాహసానికి ఛత్రపతి శివాజీ మహరాజ్ ప్రతిరూపమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని సాగర్‌రోడ్డులో హిందూవాహిని ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న శివాజీ విగ్రహ భూమి పూజకు ఆయన హాజరై మాట్లాడారు. మహావీరుని కీర్తిని విస్తరింపజేస్తూ నియోజకవర్గ కేంద్రంలో విగ్రహం ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆర్ఎస్ఎస్ విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ బంటు జనార్ధన్ మాట్లాడుతూ దేశం కోసం, ధర్మం కోసం పాటు పడిన మహానాయకుడు శివాజీమహరాజ్ అన్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో హిందూవాహిని, విశ్వహిందూ పరిషత్, శివాజీ సేన ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందూవాహిని, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు పెదబోయిన రామకృష్ణ, గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, సంఘ్ సహవ్యవస్థ ప్రముఖ్‌లు చెరుపల్లి కరుణాకర్, అక్కినేపల్లి సుధాకర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్లు బానావత్ రతన్‌సింగ్‌నాయక్, వనం మదన్‌మోహన్, నూకల వేణు, గిరి, శ్రీనివాస్, రవి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందారుల సమస్యలను పరిష్కరించాలి

మాడ్గులపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గొర్రెల పెంపకందారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జిల్లా గొర్రెల పెం పకందారుల సహకార సంఘం జిల్లా కార్యదర్శి ఊరిబండి శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పెంపకందారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించి జిల్లా వ్యాప్తంగా యూనియన్ ఏర్పాటు చేసి తక్షణమే సంఘాలకు నిధులు మంజూరు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు వెంకన్నయాదవ్, నాయకులు ఆవుల జానయ్య, తిరుపతయ్య, సోమేష్, నరేష్‌యాదవ్, గంగరాజుయాదవ్, నాగయ్యయాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమానికి కృషి చేసిన ఆర్ఎస్పీ

మిర్యాలగూడ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ జీవితం ఆదర్శనీయమని స్వేరోస్ హెల్త్ వలంటీర్స్ ఇన్‌చార్జి అమరవరపు ప్రేమ్‌కుమార్ అన్నారు. అవంతీపురంలోని గురుకుల పాఠశాలలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గ విద్యార్థుల శ్రేయస్సు కోసం ప్రవీణ్‌కుమార్ ఎంతో కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నంద, విద్యార్థి సంఘం నాయకులు ఆనంద్, సుధీర్, గోవర్ధన్, వినోద్, కమలాకర్, సతీష్, అంజి, వెంకన్న, రమేష్, లింగరాజు, అనిల్‌రెడ్డి, హరిప్రసాద్, మధు, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 46తో బీసీలకు అన్యాయం


నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

మిర్యాలగూడ టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జీవో నెంబరు 46తో బీసీలకు అన్యాయం జరుగుతోందని బీసీ జేఏసీ కన్వీనర్ బంటు వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఆదివారం స్థానిక నాయకులతో కలిసి జీవో 46 పత్రాలను చింపి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బీసీలను మోసం చేసేందుకు ప్రయతిస్తోందని ఆరోపించారు. బీసీలను మోసం చేసి, మభ్య పెట్టి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే బీసీల ఆగ్రహానికి గురి కావాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకురాలు బంటు కవిత, దేనేటి శేఖర్, రాజ్‌కుమార్, యాదగిరి, నాగరాజు, నాగేశ్, రవిచంద్రన్, వంశీ, బన్నీ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

బీసీ రిజర్వేషన్ల అంశం కొలిక్కి వచ్చే వరకు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించవద్దని బీసీ జేఏసీ కోకన్వీనర్ గాదగోని మహేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం బీసీభవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్న విధంగా కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు నాగేశ్వరరావు, బసవయ్య, రాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దేవరకొండ: ప్రభుత్వం జారీ చేసిన జీవో 46ను వెంటనే రద్దు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం దేవరకొండలో బీసీ బాలికల విద్యార్థులు, సంఘం నాయకులతో కలిసి కరపత్రాన్ని విడుదల చేసి మాట్లాడారు. కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు కుంటి సాకులు చెబుతుందని అన్నారు. బీసీలను మరోసారి మోసం చేయడానికి కుట్ర చేస్తోందని ఆరోపించారు. జీవో 46ను తీసి 50 శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థల ఎన్నికల్లో మించకూడదని, వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించడాన్ని బీసీ సంఘాలు వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు వరికుప్పల శ్రీను, పున్న వెంకటేష్, కోటేశ్వర్‌రావు, వీరయ్య, లావుడ్య భాష, శివగౌడ్, విద్యార్థులు, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


గోపాలపురంలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న కొండేటి మల్లయ్య

మాడ్గులపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య అన్నారు. మండలంలోని గోపాలపురం గ్రామంలో ఆదివారం చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని, మహిళలకు నాణ్యమైన చీరలను అందించి వారి గౌరవాన్ని కాపాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోడ యాదయ్య, నాయకులు చింతరెడ్డి సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్రంపోడు: మండలకేంద్రంలో ఇందిరా మహిళశక్తి చీరలను డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గాలి రవికుమార్, మాజీ సర్పంచ్ మస్రత్ సయ్యద్‌మియా, జాల చిన్న సత్తయ్య, పగిళ్ల లాలయ్య, కమతం జగదీశ్వర్‌రెడ్డి, మేడి వెంకన్న, శ్రీనివాస్‌గౌడ్, ఏపీఎం యేసయ్య, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సీసీ అంజయ్య, వీవోఏలు శంకర్, నాగమణి, సమాఖ్య అధ్యక్షురాలు యాదమ్మ, రేణుక పాల్గొన్నారు.

చింతపల్లి: చింతపల్లి ఎంపీడీవో కేంద్రంలో మహిళలకు డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత, జీపీఎం వీరయ్య, ఏపీఎం వి.నరసింహ, సీసీలు రమేష్, నరసింహ, వీవోఏ మేఘమాల, తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: మండలంలోని గుమ్మడవెల్లి గ్రామంలో మహిళా సంఘాల సభ్యులకు డీఆర్డీవో పీడీ శేఖర్‌రెడ్డి ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే 18 సంవత్సరాలు నిండిన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరలను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో స్వర్ణలత, ఏపీఎం యాదయ్య, సూపరింటెండెంట్ విజయ, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డి, ఉట్కూరి వేమన్‌రెడ్డి, కొడిదాల వెంకటయ్య, మల్లేష్‌యాదవ్, మంగ్యానాయక్, సురేష్, జగదీష్, డాకునాయక్, రాములునాయక్ పాల్గొన్నారు.

నేరేడుగొమ్ము: మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లోకసాని కృష్ణయ్య అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఆదివారం సమభావన సంఘాల మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో సమభావన సంఘం లీడర్లు, నాయకులు పాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద గల గ్రామ పంచాయతీలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్మటి సతీష్‌రెడ్డి చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వంగాల సత్తెమ్మ, వీరమళ్ల పరమేష, పాండునాయక్, కుశలయ్య, అక్బర్, బొల్లు సత్యనారాయణ, చిరంజీవి, డీలర్ శ్రీనునాయక్, వెలుగు సీసీ లింగయ్య, బుక్ కీపర్ సునంద, మహిళ సంఘం లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.


గుమ్మడవెల్లిలో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్న డీఆర్డీవో పీడీ శేఖర్‌రెడ్డి

నిడమనూరు: మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో సమభావన సంఘాల మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఏపీఎం నరహరి, సీసీలు నర్సింహాచారి, తంగమణి, నాయకులు అంకతి సత్యం, యడవెల్లి వల్లభ్‌రెడ్డి, నందికొండ మట్టారెడ్డి, మేరెడ్డి కేశవరెడ్డి, కొండా శ్రీనివాస్‌రెడ్డి, శివమారయ్య, విజయ్‌కుమార్, మంజులశ్రీనివాస్, చేకూరి వంశీ, మోసాల శ్రీను, మెరుగు శ్రీను, సత్యం పాల్గొన్నారు.

హాలియా: అనుముల మండలం కొత్తపల్లి, హజారీగూడెం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అలుగుల బ్రహ్మానందరెడ్డి, ఉడుతూరి భాస్కర్‌రెడ్డి, ఏపీఎం లక్ష్మీనారాయణ, మానమ్మ, ఉడుతూరి జయమ్మ, తరి మంగ మ్మ, లలిత, స్రవంతి, వెంకటమ్మ, చిన్న ముత్యాలమ్మ, ఎల్లమ్మ, అనుపమ, అశ్విని, పంగా కలమ్మ, వెంకటమ్మ, ధనలక్ష్మి, వెంకట్‌రెడ్డి, కుంటిగొర్ల శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ


అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవంలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

కొండమల్లేపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి మం డలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో శనివారం రాత్రి అయ్యప్ప స్వామి మహా పడిపూజ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిపూజ, స్వస్తి పుణ్యావచనం, సుబ్రహ్మణ్య స్వామి ధర్మశాస్త్ర అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించిన ప్రాంగణమంతా స్వామియే శరణం అయ్యప్ప అంటూ శరణుఘోషతో మార్మోగింది. ముఖ్య అతిథిగా హాజరైన సత్యనారాయణ తాంత్రిక పూజ గురుస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 18 మెట్లపై పూలు పండ్లు, కలశాలు ఉంచి జ్యోతులు వెలిగించారు. ఈ పడిపూజ కార్యక్రమానికి అయ్యప్పమాలధారులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం హాజరైన భక్తులకు అల్పాహారం అందించారు. ఈ కార్యక్రమంలో వ డ్ల్య రమేష్, గురుస్వామి చిట్టడి ప్రభాకర్‌రెడ్డి, పస్నూరి యుగేందరరె డ్డి, కాసర్ల వెంకటేశ్వర్లు, వేమన్‌రెడ్డి, బూడిద శ్రీనివాస్‌యాదవ్, తోటపల్లి కృష్ణ, గుమ్మడవెల్లి జనార్దన్, అశోక్‌యాదవ్, వడ్త్య అజయ్, బోడ నగేష్ వెంకన్న, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలోని గొల్లపల్లి గ్రామంలో ఆదివారం అయ్యప్ప మహాపడి పూజను వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు గణపతి పూజ, సుబ్రమణ్యస్వామి, మహాలక్ష్మితో పాటు అయ్యప్పస్వామికి కన్నులపండువగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప మాలధారులకు తీర్థప్రసాదంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. చాట యాదగిరి (గురుస్వామి) గృహంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకట్‌రెడ్డి, మట్ట యాదయ్య, మల్లోజు జగదీశ్వరాచారి, కాసోజు ప్రేమనందాచారి (కొండల్), మట్ట జంగయ్య, మొగుతాల శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

రాజకీయ నాయకులు సహకరించాలి : ఆర్డీవో


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రమణారెడ్డి

దేవరకొండ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు సజావు గా సాగేందుకు రాజకీయ నాయకులు సహకరించాలని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి కోరారు. స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికల రిజర్వేషన్లపై ఆదివారం ఆర్డీవో రమణారెడ్డి డివిజన్ పరిధిలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల ప్రక్రియను ప్రకటించారు. మొదటగా మహిళ రిజర్వేషన్ల ప్రక్రియను ప్ర కటించినట్లు ఆర్డీవో తెలిపారు. ఈ సమావేశంలో డివిజన్ పరిధిలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సంరక్షణ లక్ష్యంతో వైద్యశిబిరం


వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగాన్ని సంరక్షించడమే ప్రధాన లక్ష్యంగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ అంజిరెడ్డి, రివర్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్డియాక్ మెగా వైద్యశిబిరానికి పట్టణ పరిసర గ్రామాల నుంచి సుమారు 300 మంది హాజరయ్యారు. వైద్య శిబిరంలో ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ వెంకట్రావు, డాక్టర్లు సాయికుమార్‌రెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొని వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతరం ఆస్పత్రి ఎండీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఏడాదిలో రెం డుసార్లు విధిగా హెల్త్ చెకప్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్ శ్రవణ్‌కుమార్, మార్కెటింగ్ మేనేజర్ విజయ్, హరీష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో విద్యార్థులకు క్రమశిక్షణ

● ఎంకేఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవినాయక్

దేవరకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఎన్‌సీసీ వల్ల క్రమశిక్షణ, సమాజంలో బాధ్యత పెరుగుతుందని దేవరకొండ మునగాల కొండల్‌రావు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవినాయక్ అన్నారు. ఆదివారం దేవరకొండ ఎంకేఆర్ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో ఎన్‌సీసీ డే ఘనంగా నిర్వహించారు. ఎన్‌సీసీ కేడెట్లు మొక్కలు నాటి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థులు చదువుతో పాటు సమాజసేవలో పాలు పంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ కోఆర్డినేటర్ లింగమయ్య, కోటయ్య, లింగారెడ్డి, అధ్యాపకులు, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.



ఎంకేఆర్ డిగ్రీ కళాశాలలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ రవినాయక్

ఘనంగా రవీంద్రకుమార్ జన్మదిన వేడుకలు

దేవరకొండ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ జన్మదిన వేడుకలను ఆదివారం దేవరకొండలో ఘనంగా నిర్వహించారు. రవీంద్రకుమార్ స్వగృహంలో బీఆర్ఎస్ నేతలతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రవీంద్రకుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కేతావత్ బీల్యానాయక్, టీవీఎన్ రెడ్డి, బొడ్డుపల్లి కృష్ణ, వేముల రాజు, జానీబాబా, పొట్ట మధు, నాగార్జున పాల్గొన్నారు.

శాంతి ర్యాలీని విజయవంతం చేయాలి

కొండమల్లేపల్లి: బీసీలకు చట్టబద్ధమైన 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని కుమ్మర శాలివాహన సంఘం మండల కన్వీనర్, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు ఏరుకొండ రాము ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. బీసీ రిజర్వేషకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండలకేంద్రంలో నిర్వహించనున్న శాంతియుత ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ర్యాలీలో బీసీలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పల్లెల్లో ఎన్నికల సందడి

(5వ పేజీ తరువాయి)

ఆర్థిక, విద్య సర్వేను ప్రామాణికంగా తీసుకున్నారు. జిల్లాలో తాజాగా, ఖరారైన రిజర్వేషన్ల ప్రకారం ఎస్టీ మహిళలకు 89, ఎస్టీ జనరల్ 104 కలిపి 193 సర్పంచ్ పద వులు ఎస్టీలకు దక్కాయి. ఎస్సీ మహిళలకు 69, ఎస్టీ జనరల్ కేటగిరీలో 84 కలిపి మొత్తం 153 సర్పంచ్ పదవులు ఎస్సీలకు కేటాయించారు. బీసీ మహిళలకు తాజాగా 62 సర్పంచ్ స్థానాలు, బీసీ జనరల్ స్థానాలకు 77 స్థానాలు కలిపి 139 సర్పంచ్ పదవులు బీసీలకు దక్కాయి. ఓపెన్ కేటగిరీలో మహిళలకు 186 స్థానాలు కేటాయించగా, ఓపెన్ జనరల్ కేటగిరీలో 198 సర్పంచ్ స్థానాలు కేటాయించారు.

చెరువులు, కుంటల
మరమ్మతులకు నిధులు మంజూరు


శివానంద్

దేవరకొండ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మండలంలో పర్వతరావుచెరువు, భీమనపల్లి ప్రాజెక్టుతో పాటు పలు చెరువుల మరమ్మతులకు నిధులు మంజూరైనట్లు దేవరకొండ ఐబీ డీఈ శివానంద్ తెలిపారు. దేవరకొండలో పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బ తిన్న చెరువులు, కుంటలకు మరమ్మతులు చే పట్టనున్నట్లు తెలిపారు. దేవరకొండ మండలంలో 62 చెరువులు, కుంటలు ఉన్నట్లు వెల్లడించారు. భీమనపల్లి ప్రాజెక్టు మరమ్మతులు, కంపచెట్లు తొలగించేందుకు రూ.35.95లక్షలు మంజూరైనట్లు తెలిపారు. పర్వతరావు చెరువు మరమ్మతులకు రూ.1.22కోట్లు మంజూరయ్యాయని, త్వరలో పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. భీమనపల్లి ప్రాజెక్టు వర్షాలకు నిండిందని, ప్రాజెక్టు పరిధిలో 12 వేల ఎకరాల ఆయకట్టు ఉందని పేర్కొన్నారు. మరమ్మతులకు గురైన చెరువులు, కుంటలకు కూడా పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు పంపించినట్లు ఐబీ డీఈ శివానంద్ వెల్లడించారు.